రూ.లక్షన్నర పలికిన దుర్గమ్మ లడ్డూ

చీడికాడ, న్యూస్‌టుడే: అర్జునగిరిలో లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి పీఠం వద్ద సోమవారం 30 కేజీల లడ్డూ ప్రసాదం వేలంలో రూ.లక్షన్నర పలికింది. గ్రామానికి చెందిన కింగ్స్ ఆఫ్ యూత్ సభ్యులు లడ్డూను దక్కించుకున్నారు. గతేడాది 25 కేజీల లడ్డూ రూ.60 వేలు పలికింది. ఈ ఏడాది రెట్టింపు పలకడం ఆనందంగా ఉందని గురుభవాని ప్రసాద్ పేర్కొన్నారు. లడ్డూను గ్రామానికి చెందిన అల్లం మహాలక్ష్మి దుర్గాదేవికి ప్రసాదంగా అందజేశారని చెప్పారు. లడ్డూ వేలం ద్వారా వచ్చే మొత్తాన్ని వచ్చే ఏడాది అంబలం పూజకు, మిగిలినవి లక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధికి అందజేయనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు నిర్వహించిన అంబలం పూజకు భవానీలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



లడ్డూ వేలంలో భవానీలు

బ్యాడ్మింటన్ జాతీయ పోటీలకు నర్సీపట్నం విద్యార్థి



నర్సీపట్నం, న్యూస్‌టుడే: స్థానిక అమరావతి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న **మచ్చా చరణ్** బాల్ బ్యాడ్మింటన్ జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థి విశాఖపట్నంలోని కిరణ్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. చరణ్ ప్రస్తుతం విజయవాడలో నిర్వహిస్తున్న అఖిల భారత సబ్ జూనియర్ అండర్-15 సింగిల్స్ విభాగంలో అయిదు రౌండ్లు గెలిచి జాతీయ పోటీలకు అర్హత దక్కించుకున్నాడు.

మినీ గోకులాల్లో మింగేశారిలా..

రైతులే నిర్మించుకున్నా ఏజెన్సీకి బిల్లులు
షెడ్లు లేకపోయినా ఉదారంగా చెల్లింపులు
అధికారుల చేతివాటం రూ.5.89 కోట్లు





ఈనాడు, అనకాపల్లి

పశువులకు నీడ కోసం నిర్మించిన మినీ గోకులాల షెడ్లలో నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. పాడి రైతులకు ఊతమిచ్చేలా రూపొందించిన పథకాన్ని అధికారులు, సరఫరా సంస్థ కలిసి పక్కదారి పట్టించారు. గతేడాది రైతులు ఫిర్యాదుతో కదిలిన ఈ అక్రమాల డొంక పశు సంవర్ధక శాఖలో ముగ్గురు అధికారుల మెడకు చుట్టుకుంది. అప్పట్లో పాడేరు, అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లో వివిధ హోదాల్లో పనిచేసిన జి.వెంకటస్వామి, అత్మతామ్, జి.గౌతమ్‌లను బాధ్యులుగా గుర్తించి ఇటీవలే సస్పెండ్ చేశారు. తాజాగా గోకులం నిర్మాణాలకు సంబంధించి రూ.5.89 కోట్ల సొమ్ముల చెల్లింపుల్లో చోటుచేసుకున్న అక్రమాలపై అభియోగాలు నమోదు చేయడం చర్చనీయాశంగా మారింది.

గత తెదేపా ప్రభుత్వ హయాంలో పాడి పశువుల సంరక్షణార్థం ఉపాధిహామీ నిధులతో గోకులం షెడ్లను నిర్మించారు. పశువులకు తగిన నీడ, సదుపాయాలను కల్పిస్తే పాల ఉత్పత్తి పెరుగుతుందని అప్పటి సర్కారు సదుద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేసింది. ఉమ్మడి జిల్లాలో 4,570 యూనిట్లు మంజూరు చేసింది. రైతులకు అవగాహన కల్పించి గోకులాలు, మినీ గోకులాల షెడ్ల నిర్మించుకునేలా ప్రోత్సహించాలని సూచించింది. దీనికోసం పశు సంవర్ధకశాఖ, ఉపాధిహామీ అధికారుల సమన్వయంతో కమిటీలు ఏర్పాటు చేసి లక్ష్యాలు విధించింది. ఇక్కడే కొంతమంది అధికారులు చేతివాటం ప్రదర్శించారు. ప్రభుత్వానికి లక్ష్యాలను చేరుకున్నట్లు చూపించడం కోసం షెడ్ల నిర్మాణాలు జరగకపోయినా ప్రగతిలో ఉన్నట్లు దస్త్రాల్లో చూపి బిల్లులు చేసుకున్నారు. కొంత మంది రైతులు సొంతసొమ్ముతో షెడ్ల నిర్మించుకున్నారు. అయితే వారికి తెలియకుండా మెటీరియల్ సరఫరా చేసే సంస్థ పేరిట బిల్లులు చెల్లించి అధికారులు వాటాలు పంచుకున్నారు. కొన్నిచోట్ల సామాజిక తనిఖీల్లో ఈ బాగోతం బయటపడినా స్థానికంగా రాజీచేసుకున్నారు. మరికొంతమంది షెడ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా బిల్లులు అందడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



ఇలాంటి మినీ గోకులాల నిర్మాణాల్లోనే అక్రమాలు

మాయాజాలం ఇలా..

మండలం	మంజూరైన యూనిట్లు	ఏజెన్సీకి పనులు	చెల్లింపుల విలువ (రూ.లక్షల్లో)
చీడికాడ	82	73	66.43
వి.మాడుగుల	113	111	89.06
గొలుగొండ	81	77	63.16
నర్సీపట్నం	16	16	16.01
రావికమతం	36	36	33.57
రోలుగుంట	15	15	15.54
మాకవరపాలెం	151	149	155.58
కోటవురట్ల	276	111	99.35
	770	588	539.33

క్షేత్రస్థాయి విచారణతో...

మినీ గోకులాలపై అందిన ఫిర్యాదుతో అప్పటి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ముగ్గురు అధికారులతో విచారణ చేపట్టారు. డ్వామా ఏపీడీ రోజారాణి, డీఆర్డీఏ ఏపీవో నాగలక్ష్మి, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి ప్రసాదరావు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. షెడ్లను లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకోవచ్చు. లేకపోతే మెటీరియల్ సరఫరా సంస్థకైనా అప్పగించుకునే వెసులుబాటు ఉంది. లబ్ధిదారుల ఆమోదంతోనే థర్డ్ పార్టీకి అప్పగించాలి. అయితే అధికారులు 477 పనులకు సంబంధించి రైతులు సొంతంగా నిర్మించుకున్నా వారి అనుమతి లేకుండా సాయి బాలాజీ ఎంటర్‌ప్రైజెస్ పేరిట చెల్లింపులు చేసినట్లు గుర్తించారు. రూ.19.14 లక్షలు థర్డ్ పార్టీకి బిల్లులు చెల్లించారు. అసంపూర్తి పనులు చేసినా పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించేశారు. ఇలా రూ.30.66 లక్షలు సాయి బాలాజీ సంస్థ పేరిట బిల్లులు చేశారు. 117 షెడ్ల నిర్మాణాలకు సంబంధించి ఎం.బుక్, ఇతర దస్త్రాలను విచారణ అధికారులకు చూపించలేకపోయారు. మిగిలిన రికార్డుల నిర్వహణ సరిగ్గా లేదని, ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి అప్పటి అధికారుల నిర్లక్ష్యమే కారణమని తేల్చారు.

సిఫార్సులకు తావులేకుండా పదవులు

అనకాపల్లి, న్యూస్‌టుడే: 'పార్టీలో కష్టపడి పనిచేసే వారి వివరాలన్నీ అధిష్ఠానం వద్ద ఉన్నాయి. సిఫార్సులకు తావులేకుండా పదవులు వస్తాయ'ని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఛైర్మన్‌గా ఎంపికైన జిల్లా తెదేపా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం రాత్రి తెదేపా నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. తాతయ్యబాబు మాట్లాడుతూ రూ. 100 సభ్యత్వం చెల్లిస్తే రూ. 5 లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. ప్రతి కార్యకర్త గర్వంగా చెప్పుకొనే విధంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని వివరించారు. రాష్ట్ర ఆర్థిక, మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ వైకాపా పాలనలో టిడ్కో ఇళ్లని తెదేపా హయాంలో మంజూరు చేసిన వారికే అందిస్తామని తెలిపారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ కలెక్టర్ సహా అధికారులు కూడా తెదేపాను గుర్తించడం లేదన్నారు. ఇతర పార్టీల కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం తెదేపా నాయకులకు లేదన్నారు. గెలిచిన వారు పాలన సాగించాలే గానీ, వారి కుటుంబ సభ్యులు, అల్లుళ్ల పాలన చేయడం సరికాదన్నారు. సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో వైకాపా నాయకులకు అనుకూలంగా పనిచేసిన అధికారులే ఇప్పుడూ పనిచేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై విచారణ చేసి వారిని సస్పెండ్ చేయాలని, చేయకపోతే ఆందోళన చేపట్టాలన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించిన దాడి, పీలా, బత్తుల తదితరులు

వైద్య ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా రామారావు



రావికమతం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా వైద్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా కొత్తకోట పీహెచ్‌సీ ఎంపీహెచ్ ఈవో పాతాళ రామారావు ఎన్నికయ్యారు. సంఘ సర్వసభ్య సమావేశం సోమవారం అనకాపల్లిలో జరిగింది. అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా శివ (తాళ్లపాలెం), కోశాధికారిగా అమ్మాజీ (వడ్డాది), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఐ.శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శిగా వీఎస్ఎం లక్ష్మి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్.ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా రత్నం, వెంకట్రావు, కన్నతల్లి, ఆదిలక్ష్మి, పద్మ, జయలక్ష్మి, రమణమ్మ, ఆర్వీ నాగేశ్వరరావు, సీహెచ్ రమణ, సూర్యకుమారి, పద్మ, సత్యవతి, రమాదేవి, ప్రేమకుమారి ఎన్నికయ్యారు.

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ విజేత విశాఖ

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మండలంలోని నునపర్తిలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అండర్-19 బాల బాలికల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు సోమవారంతో ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. తుది పోటీల్లో విశాఖ-శ్రీకాకుళం బాలురు జట్ల మధ్య హోరాహోరీగా పోరు జరిగింది. ఈ పోటీల్లో విశాఖ జట్టు విజయం సాధించింది. ఇదే విధంగా బాలికల విభాగంలో విశాఖ-తూర్పు గోదావరి జట్ల మధ్య పోటీ జరగ్గా విశాఖ జట్టే ప్రతిభ చూపించి విజయం పొందింది. ఈ పోటీల్లో ప్రతిభ చూపించిన క్రీడాకారులను గుర్తించి జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. విజేతలకు ఏపీ బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరావు, విశ్రాంత న్యాయమూర్తి పైలా సన్నిబాబు బహుమతులు అందించారు. కమిటీ ప్రతినిధులు ఆర్.వి.వి. నగేష్, గొంప నరసింహనాయుడును రాష్ట్రస్థాయి కమిటీ ప్రతినిధులు అభినందించారు. ఈకార్యక్రమంలో బీసీ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులు నరవ రాంబాబు, అఖిల భారత సమాఖ్య జనరల్ కార్యదర్శి వై.రాజారావు, రాష్ట్ర సంఘం అధ్యక్షులు వై.విజయశంకర్‌రెడ్డి, ఆర్.వెంకటరావు, కమిటీ ఛైర్మన్ నగేష్, నాయకులు మాసవరపు అప్పలనాయుడు, జిల్లా అధ్యక్షులు ప్రభూజి, కార్యదర్శి గొంప నరసింహనాయుడు, పెదపాడి శంకరరావు పాల్గొన్నారు.



తుదిపోరులో బాలికలు



విశాఖ బాలుర జట్టుకు బహుమతి అందిస్తున్న రాష్ట్ర కమిటీ ప్రతినిధులు

కిశోర వికాసం..

చదువు మానేస్తున్న బాలికల గుర్తింపు
కూటమి ప్రభుత్వ హయంలో బాలికల సంక్షేమానికి చొరవ

అనకాపల్లికి చెందిన బాలికకు రెండేళ్ల క్రితం వివాహం చేస్తున్నారన్న సమాచారంతో అంగన్‌వాడీ సిబ్బంది వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వివాహం ఆపించారు. చిన్న వయస్సులో పెళ్లి చేయడం కలిగే నష్టాలు, బాధ్యులపై పెట్టే కేసులను వివరించారు.

ఎలమంచిలికి చెందిన బాలికని తల్లిదండ్రులు పదోతరగతి వరకు చదివించారు. ఇంటర్ చదివించే స్థోమత లేకపోవడంతో ఆమె చదువు ఆగిపోయింది. ప్రస్తుతం విద్యార్థిని ఇంటి వద్దనే ఉంటోంది.

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే



జిల్లాలో ఎంతో కిశోర బాలికలు చదువుకు దూరంగా ఉంటున్నారు. ఇది వరకు తెదేపా హయాంలో కిశోరబాలికలను గుర్తించి వారి స్థితి గతులపై సర్వే చేసి వారికి పోషకాహారం, నేప్‌కిన్ కిట్ అందజేసేవారు. వైకాపా అధికారంలోకి వచ్చాక ఐరన్‌మాత్రలు మాత్రమే అందేవి. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో జిల్లాలో సర్వే చేపట్టి కిశోరబాలికను గుర్తించి వీరిలో ఎంతమంది చదువు మానేశారనేది సర్వే చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అక్టోబరు నెలాఖరుకల్లా దీన్ని పూర్తిచేసేందుకు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులు చొరవ చూపుతున్నారు. జిల్లాలో 14 నుంచి 18 ఏళ్ల లోపు ఉన్న బాలికల వివరాలతో పాటు వీరిలో చదువు మధ్యలో ఆపేసిన వారు ఎంతమంది ఉన్నారో గుర్తిస్తున్నారు. గత ఏడాది జిల్లాలో 75 మందిని గుర్తించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో వీరి అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

బాల్యవివాహాలు, ఆర్థిక ఇబ్బందులు, కళాశాలలు అందుబాటులో లేకపోవడం, ఇంటి బాధ్యతలు ఇలా ఎన్నో కారణాలతో కిశోర బాలికల్లో చాలామంది చదువుకు దూరం అవుతున్నారు. ఆడపిల్లలకు పెళ్లి చేసేస్తే సరిపోతుందన్న భావన కొందరి తల్లిదండ్రుల్లో ఎక్కువగా ఉన్న కారణంగా ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఈ సమస్యను పరిష్కరించి కిశోర బాలికలకు చదువు చెప్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

కిశోర వికాసం పేరుతో 14 నుంచి 18 ఏళ్ల లోపు ఉన్న బాలికలను గుర్తిస్తారు. వీరిలో ఎంత మంది చదువుమానేశారన్నది గమనించి వారు ఏఏ కారణాలతో చదువు మానేశారో వివరాలు సేకరిస్తారు. ఇలా సేకరించిన అనంతరం చదువు మానేసిన కిశోరబాలికలకు ఎంత మంది ఉంటే వారిని గ్రామాల వారీగా గ్రూపులు పెడతారు. వీరిలో చదువు మధ్యలో ఆపేసిన వారికి చదువు చెప్పడం. స్కిల్ డెవలప్‌మెంట్ అవసరమైన వారికి శిక్షణ, వృత్తివిద్యా కోర్సుల్లో చేర్పించడం ఇలా వారికి దేనిపై ఆసక్తి ఉందో వాటిని నేర్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఎంత మంది ఉన్నారో గుర్తించి వారికి శిక్షణ అందించే ఏర్పాట్లను ప్రభుత్వం చేయనుంది.



ఇంటర్ చదువుతున్న బాలికలు

సిబ్బందికి శిక్షణ..

కిశోర వికాసం కింద చదువు మానేసిన బాలికలను గుర్తించేందుకు చేపట్టాల్సిన సర్వేపై జిల్లాలోని తొమ్మిది మంది సీడీపీఓలు, 52 మంది సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చాం. వీరు జిల్లాలోని 1630 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి కిశోర బాలికలను గుర్తించే కార్యక్రమాన్ని ఈనెలాఖరు కల్లా పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతాం. – **ఎల్. సుజాత, నోడల్ అధికారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ**



శాఖల సమన్వయంతో..

కిశోర బాలికల స్థితిగతులను పరిశీలించేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుంది. చదువు మానేసిన వారిని గుర్తించి వారి అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చదువు మానేసిన వారికి ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోతే వైద్యులతో పరీక్ష చేయించడం, పోషకాహార లోపాలు సరిదిద్దడానికి వైద్యులతో, విద్య కోసం సంబంధిత అధికారులతో, ఉపాధి శిక్షణకు స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులతో సమన్వయం చేసి కిశోర వికాసానికి చొరవ చూపుతాం. – **అనంతలక్ష్మి, స్త్రీ,శిశు సంక్షేమశాఖ సాధికారత జిల్లా అధికారిణి**



కోల్‌కతాకు సైకిల్‌యాత్ర

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: దోసూరు శివారు కొల్లివానిపాలేనికి చెందిన పైలా మణీంద్ర కోల్‌కతాకు సైకిల్ యాత్ర ప్రారంభించారు. అచ్యుతాపురంలోని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ నివాసం నుంచి ఈ యువకుడు యాత్రకు శ్రీకారం చుట్టాడు. అయిదు రోజుల పాటు రోజుకు 200 నుంచి 250 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తూ కోల్‌కతాకు చేరుకొని కాళీమాతను దర్శించుకోనున్నాడు. ఈ యాత్రను ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. యాత్రలో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా, వసతి కావాల్సి వచ్చినా సంప్రదించాలని యువకుడికి ఎమ్మెల్యే సూచించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి డ్రీమ్స్ నాయుడు, నాయకులు జనపరెడ్డి నర్సింగరావు, బైలపూడి రాందాసు, ద్వారపురెడ్డి బాబ్జీ, లాలం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మణీంద్రను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుందరపు



ఎలమంచిలి మిలట్రీ కాలనీలో ఆకట్టుకున్న దుర్గాదేవి అలంకరణ



వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద బాలికల నృత్య ప్రదర్శన

భళారే బాలికల నృత్యం

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎలమంచిలి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో సోమవారం బాలికలు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. - న్యూస్‌టుడే, ఎలమంచిలి

పెన్సిల్ ముల్లు కొనపై విమానం



జాతీయ వాయుసేనా దినోత్సవం సందర్భంగా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లుకు చెందిన సూక్ష్మకళాకారుడు, గిన్నిస్‌బుక్ అవార్డు గ్రహీత డాక్టర్ గట్టెం వెంకటేష్ పెన్సిల్‌ముల్లు కొనపై విమాన రూపాన్ని మలిచారు. 18 మిల్లీమీటర్ల పొడవు, 8 మిల్లీమీటర్ల వెడల్పుతో దీన్ని తయారు చేయడానికి సుమారు మూడు గంటల సమయం పట్టినట్లు ఆయన వెల్లడించారు. – నక్కపల్లి, న్యూస్‌టుడే

గెడ్డ ఇసుకతో నిర్మాణాలు



అచ్యుతాపురంలో ఇసుక లభించక నిర్మాణదారులు అవస్థలు పడుతున్నారు. ఎర్ర మట్టి కలిసి ఉండే కొండగెడ్డ ఇసుకతో నిర్మాణాలు చేపడితే 50 శాతం నాణ్యత ఉండదని తెలిసినా గత్యంతరం లేక దాంతోనే నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గెడ్డల్లోకి చేరిన ఇసుకను ట్రాక్టర్‌కు రూ. 8 వేలకు కొనుగోలు చేస్తున్నారు. – అచ్యుతాపురం, న్యూస్‌టుడే

జలజలా పారుతూ..

జి.భీమవరం సమీపంలో జలపాతం పరవళ్లు తొక్కుతోంది. వర్షాకాలం చుట్టంలా వచ్చి ఇక్కడ సమీపంలోని గ్రామాల వారిని తన సోయగాలతో పలకరిస్తోంది. దసరా సెలవులు కావడంతో విద్యార్థులు ఆటవిడుపుగా ఈ జలపాతంలో ఈత కొట్టి సరదాగా గడుపుతున్నారు. – న్యూస్‌టుడే, కశింకోట



శివదత్ బాధ్యతల స్వీకరణ



పౌరసరఫరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా జనసేన నాయకుడు బోడపాటి శివదత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని కానూరు పౌరసరఫరాల కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాల కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్ సమక్షంలో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా శివదత్‌ను మంత్రి మనోహర్ అభినందించారు. – నక్కపల్లి, న్యూస్‌టుడే

భారీ మీనం.. రెక్కలు ఘనం



విశాఖ మత్స్యకారులకు సోమవారం సాగరంలో కొమ్ము కోనం చేపలు భారీగా లభించాయి. విశాఖపట్నం నుంచి కేరళ తరలించేందుకు వాటిని ప్యాకింగ్ నిమిత్తం ముక్కలు ముక్కలుగా కోశారు. కొన్ని చేపల రెక్కలు భారీగా పెరగడంతో పలువురు ఆసక్తిగా తిలకించారు.

ఉపకరణం.. ఇలా ఉపయోగకరం!!

విశాఖపట్నం వుడా బాలల ప్రాంగణంలో సోమవారం దివ్యాంగులకు, వృద్ధులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. నడవలేని కొందరికి సరికొత్త పరికరాలు అందించారు. 'ఊత కర్ర పట్టుకొని నడిచివెళ్లి.. మార్గమధ్యలో అలుపు వస్తే అదే కర్రని కుర్చీలా మార్చుకొనే' పరికరం కూడా ఇందులో ఉంది. అది ఏవిధంగా పని చేస్తుందో ఈ వృద్ధుడు చూపించారు.



– ఈనాడు, విశాఖపట్నం

లారీలను అడ్డగించి దౌర్జన్యం

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, డీఆర్వో జి.దయానిధి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'మార్టూరు నుంచి చింతనిప్పుల అగ్రహారం వెళ్లే రహదారిపై కొందరు లారీలను అడ్డుకుంటూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. డ్రైవర్లను బెదిరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఏళ్ల తరబడి దాడులు సాగిస్తున్నారు. మాకవరం, మార్టూరు గ్రామాలకు చెందిన లారీలను ఆపేస్తున్నార'ని బాధితుడు కోరుకొండ త్రిమూర్తులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సోమవారం ఫిర్యాదు చేశారు. జిల్లా వ్యాప్తంగా సమస్యల పరిష్కారం కోరుతూ 232 వినతులు వచ్చాయి. వాటి పరిష్కారంపై సంబంధిత అధికారులు శ్రద్ధ చూపాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టర్‌తోపాటు జేసీ జాహ్నవి అర్జీలు స్వీకరించారు. నిర్ణీత సమయంలోపు వీఆర్‌ఓలకు అర్జీలు రాసి సహకారం అందించారు. గతంలో అర్జీలు రాయడానికి ప్రైవేటు వ్యక్తులు డబ్బులు వసూలు చేసేవారు.



అర్జీలతో వేచి ఉన్న అర్జీదారులు

★ పాయకరావుపేట, పాయకరావుపేటకు చెందిన రైతులు, గ్రామస్థులు కలెక్టర్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచి అన్నం అప్పారావు మాట్లాడుతూ 2022లో జగనన్న లేఅవుట్ ఏర్పాటులో భాగంగా ల్యాండ్ పూలింగ్ చేపట్టి సాగులో ఉన్న భూములు తీసుకున్నారన్నారు. [illegible] అధికారులు స్పందించక తరం కలెక్టర్‌ను వినతిపత్రం అందజేశారు.



త్రిమూర్తులు, మార్టూరు

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నా పింఛను లేదు!



కొన్నేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నా. ఇటీవల ఒక కిడ్నీ తొలగించారు. దీంతో అనారోగ్యంతో నడవలేక ఏ పనిచేసుకోలేక అవస్థలు పడుతున్నా. నాకు భార్య, పిల్లలు ఉన్నారు. కుటుంబ పోషణ కష్టంగా ఉంది. పింఛను మంజూరు చేయాలని పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదు. తక్షణమే పింఛను మంజూరు చేయాలి.

– వి.శ్రీను, ముద్దుర్తి, చోడవరం మండలం

చిటికెలో..

- అందుబాటులో యంత్రాలు
- రూపొందించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

న్యూస్‌టుడే, అనకాపల్లి

పొట్టు తీద్దాం.. పప్పు చేద్దాం

చిరుధాన్యాలు, అపరాలను బాగు చేసి ఉప ఉత్పత్తులుగా విక్రయిస్తే రైతులకు మరింత ఆదాయం వస్తుంది. పొట్టు తీయడం, బద్దలుగా మార్చడం ఇప్పటివరకు పెద్ద పనిగా ఉండేది. యంత్రాలు అందుబాటులోకి రావడంతో చిటికెలో పని పూర్తవుతోంది. చిన్న, సన్నకారు రైతులను దృష్టిలో ఉంచుకుని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ఇంజినీరింగ్ విభాగం శాస్త్రవేత్తలు వీటిని తయారు చేశారు.

కేజీ మినుములు విక్రయిస్తే రైతుకు వచ్చేది రూ.70. పప్పుగా విక్రయిస్తే రూ.130 వస్తుంది. పప్పుగా మార్చే యంత్రాలు గ్రామీణ ప్రాంతాల్లో లేకపోవడంతో రైతులు పొలాల్లోనే చిరుధాన్యాలు, అపరాలను వ్యాపారులకు అమ్మేస్తున్నారు. అపరాల్లో మినుము, పెసర, కంది ఎక్కువగా సాగవుతోంది. వీటి పొట్టు తీయడంతోపాటు బద్దగా చేసేందుకు అధునాతన యంత్రాన్ని శాస్త్రవేత్తలు రూపొందించారు. దీని విలువ రూ.1.2 లక్షలు. గంటకు 125 కేజీల వరకు పొట్టు తీసి పప్పుగా చేయవచ్చు.



అపరాల పొట్టు, కొబ్బరి తురుము, ఉసిరి, అల్లంకు బెల్లం కోటింగ్ చేసే యంత్రాలు

చిరు ధాన్యాలకు ప్రత్యేకం..: ఇటీవల కాలంలో చిరుధాన్యాల వినియోగంతోపాటు సాగు బాగా పెరిగింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు చోడి, కొర్రలు, ఊదలు, వరిగలు, అరికలు, సామలు సాగు చేస్తున్నారు. వీటిపై ఉండే పొట్టు తీసేందుకు శాస్త్రవేత్తలు యంత్రాన్ని తయారు చేశారు. దీని విలువ రూ.2.2 లక్షలు. గంటకు వంద నుంచి 150 కేజీల వరకు పొట్టు తీయవచ్చు.



చిరుధాన్యాల పొట్టు తీసే యంత్రం

రైతులకు శిక్షణ ఇస్తాం

ఆరుగాలం కష్టపడి సాగు చేసే రైతులకు దక్కేది పావలా అయితే.. వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి వాటిని ఉప ఉత్పత్తులుగా విక్రయించే వ్యాపారికి వంద శాతం లాభం వస్తోంది. రైతులే ఉప ఉత్పత్తులను చేసేందుకు అనువైన యంత్రాలను సిద్ధం చేశాం. ఆసక్తి ఉన్న రైతులు యంత్రాల పనితీరును స్వయంగా పరిశీలించవచ్చు. అవసరమైన సాంకేతిక సలహాలతోపాటు యంత్రాలను ఉపయోగించే విధానంపై శిక్షణ ఇస్తాం.

– డాక్టర్ పీవీకే జగన్నాథరావు, ప్రధాన శాస్త్రవేత్త

రైతేరాజు

వంగ మొవ్వులో కీటకాలు.. నివారణ చర్యలు

రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

? అర ఎకరాలో వంగ తోట వేశా. మొవ్వును కీటకాలు ఆశించాయి. నివారణకు ఏం చేయాలి.

– ఎవీ రామారావు, వెంకుపాలెం

✔ పురుగులు ఆశించిన కొమ్మల చివర్లను తుంచేయాలి. లీటరు నీటిలో మూడు గ్రాముల కార్బరిల్ / రెండు మి.లీ. ప్రొఫెనో పాస్ ద్రావణం పిచికారీ చేయాలి.

? ఖరీఫ్‌లో వరి పంట వేశాను. రబీలో వరి వేద్దామనుకుంటున్నా. ఏఏ రకాలు అనువైనవి.

– కె. అప్పారావు, వాడ్రాపల్లి

✔ రబీలో వరి సాగు చేసేందుకు విజేత, పుష్కల, శ్రీసత్య, కాటన్ దొర సన్నాలు, నెల్లూరు మసూరి రకాలు అనువైనవి.

రైతుల ప్రశ్నలు, సందేహాలకు అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ దాడి ఉమామహేశ్వరరావు సమాధానాలు ఇచ్చారు. – న్యూస్‌టుడే, అనకాపల్లి



సాగులో సందేహాలా ఫోను చేయండి

చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సేద్యపు విభాగం శాస్త్రవేత్త సందీప్ నాయక్ సమాధానాలు ఇస్తారు. మంగళవారం ఉ: 9 నుంచి - సాయంత్రం 5 గంటల మధ్య 86884 45135 నంబరుకు ఫోన్ చేయవచ్చు.

మధ్య రకం బెల్లం ధరలో వృద్ధి



అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి బెల్లం మార్కెట్‌లో గత వారం రోజులుగా మధ్య రకం బెల్లం ధరలు భారీగా పెరిగాయి. రంగు, నాసిరకాల ధరలు స్వల్పంగా తగ్గాయి. రంగులు వంద కేజీలకు రూ. 5, నాసి రకాలు రూ.15 తగ్గాయి. మధ్య రకాలు రూ.470 పెరిగాయి.

రకం	గత వారం	ఈ వారం
రంగులు	4,965	4,960
మధ్య	3,750	4,220
నాసి	3,250	3,235

పక్షులు.. రైతు నేస్తాలు

కీటక సంహారంలో తోడ్పాటు



న్యూస్‌టుడే, చింతపల్లి

పక్షి సంపద ప్రకృతి వరప్రసాదం. ఇవి కీటకాలను సంహరిస్తూ పంటల సాగులో రైతులకు సహకరిస్తున్నాయి. దేశంలో సుమారు 1200 జాతుల పక్షి జాతులున్నాయి. వీటిలో 346 జాతులు పంటలను ఆశించే పురుగులను ఆహారంగా తీసుకుంటూ రైతులకు పరోక్షంగా మేలు చేస్తున్నాయి. వివిధ దశల్లో పంటలను నష్టపరుస్తున్న పురుగులను సమర్థవంతంగా గుర్తించి వాటిని భక్షిస్తాయి. ప్రధానంగా తెల్లకొంగలు, మంగలిపిట్ట, గోరింక, పాలపిట్టలు రైతు నేస్తాలుగా గుర్తింపుపొందాయి.

● పత్తి, కంది పంటలను నాశనం చేసే శనగ పచ్చ పురుగు, పొగాకులో లద్దె పురుగులను 40-60 శాతం వరకు పక్షులే నాశనం చేస్తాయి. ఒక కొంగ 20 నిమిషాల్లో వేరుశనగలో 50 పురుగులను తింటుంది.

● భూమిని ఒకటికంటే ఎక్కువసార్లు దున్నడం వల్ల వేరుపురుగులు బయటపడి పక్షుల బారినపడతాయి. గుడ్లగూబలు రాత్రి సమయంలో పొలాల్లో సంచరిస్తూ తల్లివేరు పురుగులను ఆహారంగా తింటుంటాయి. గోరింకలు, పిచ్చుకలు వ్యాధి సోకిన వేరు పురుగులు, శనగ పచ్చ పురుగులను తింటూ పరోక్షంగా బ్యాక్టీరియా వ్యాప్తికి దోహదం చేస్తాయి.



వరి పొలంలో పక్షులు వాలేందుకు కర్రల ఏర్పాటు

పక్షి జాతులను కాపాడుకోవాలి..: వివిధ రకాల పక్షులను సంరక్షించడం ద్వారా పంటలను ఆశించే వివిధ రకాల తెగుళ్లు, చీడపీడలను సమర్థంగా నివారించవచ్చు. ఇందుకోసం పంట పొలాల్లో 'టి' ఆకారంలో కర్రలను ఎకరాకు 20 చొప్పున ఏర్పాటు చేయాలి. పసుపు కలిపిన అన్నం, నీటిని పంట పొలాల వద్ద ఉంచడం ద్వారా పురుగులను తినేందుకు పక్షులు ఎక్కువగా వస్తాయి. మామిడి, వేపచెట్లు, మల్బరీ, నేరేడు చెట్లను పొలం గట్లపై పెంచడం ద్వారా వివిధ రకాల పక్షి జాతులు స్థావరాలను ఏర్పాటు చేసుకుంటాయి.

– డాక్టర్ అప్పలరాజు, కీటక విభాగం శాస్త్రవేత్త



డీఎల్ పురంలో రాష్ట్ర బృందం పర్యటన

నక్కపల్లి, న్యూస్‌టుడే: బాలల స్నేహపూర్వక గ్రామం (చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్) విభాగంలో జాతీయస్థాయిలో పోటీ పడుతున్న నక్కపల్లి మండలం డి.ఎల్.పురం పంచాయతీలో సోమవారం రాష్ట్ర బృందం పర్యటించింది. దీనిలో భాగంగా నలుగురితో వచ్చిన కమిటీ సభ్యులకు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం వీరు ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, తాగునీటి పథకాలు, పారిశుద్ధ్యం, వైద్యం తదితర అంశాలను పరిశీలించారు. ఇక్కడ అమలు చేస్తున్న విధానాలు తెలుసుకున్నారు. [illegible] తిలకించారు. గ్రామసభ నిర్వహణ రికార్డులు పరిశీలించారు. వీటన్నింటినీ వీడియో తీసుకున్నారు. కేంద్ర కమిటీకి నివేదిక అందజేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీతారామరాజు, ఏంఈఓలు నరేష్, నూకరాజు, సర్పంచి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వైద్య సేవలు పరిశీలిస్తున్న బృందం సభ్యులు

సంప్రదాయ వైద్యాన్ని భాగస్వామ్యం చేయాలి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఆరోగ్య సంరక్షణలో సంప్రదాయ వైద్యాన్ని భాగస్వామ్యం చేయాలని ఇండియన్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిత్య రంగనాథ్ తెలిపారు. పట్టణంలో శ్రీగౌరీ గ్రంథాలయంలో 'ఆరోగ్యం - అనారోగ్యం - జాగ్రత్తలు'పై సోమవారం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. [illegible] ప్రపంచ ఆరోగ్య సంస్థ [illegible] ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యులు సూర్యచందిని, గ్రంథాలయ అధ్యక్షులు నూక అప్పారావు, కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, కాండ్రుగుల జగ్గారావు, మళ్ల బాపునాయుడు, విల్లూరి రాజేష్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఆదిత్య


ప్రత్యేక కేటగిరీగా బదిలీలు చేపట్టాలి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: గత ప్రభుత్వ తొందరపాటు నిర్ణయాలతో గిరిజన ప్రాంతానికి బదిలీ అయిన మైదాన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి.శ్రీదేవి కోరారు. అనకాపల్లి సీపీఐ కార్యాలయంలో సోమవారం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణ, నక్కా శ్రీనుబాబు, ఎంటీఎస్ నాయకుడు వేచలపు ఈశ్వరరావులతో కలిసి ఆమె మాట్లాడారు. తమ సమస్యను మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, చిరంజీవి, ఏఎస్ రామకృష్ణలకు ఎంటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటరావు, బి.హైమారావులతో కలిసి వివరించామన్నారు. జిల్లా మంత్రి అనిత దృష్టికి కూడా తెచ్చామన్నారు. అన్యాయాన్ని సరిచేస్తామని వారు హామీ ఇచ్చారని వివరించారు. 117 జీఓతో ఉపాధ్యాయులు ఇబ్బందుల పాలయ్యారన్నారు. జీఓ నంబరు 3 రద్దు కావడంతో గిరిజన ప్రాంతానికి మైదాన ఉపాధ్యాయులు వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఏ జిల్లాలో లేని విధంగా సుమారు 430 మంది ఉపాధ్యాయులకు గిరిజన ప్రాంతానికి బదిలీ అయ్యారన్నారు. ప్రత్యేక కేటగిరీ కింద వీరిని భావించి తిరిగి మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలంగా ఉన్నందున త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం అవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల్లో సంఘం తరపున అభ్యర్థిని నిలిపే ఆలోచన చేస్తున్నామన్నారు.



ఎమ్మెల్సీ అశోక్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న సంఘ నాయకులు

జడ్పీ సీఈవోగా నారాయణమూర్తి బాధ్యతల స్వీకరణ



విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి(సీఈవో)గా పి.నారాయణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి సీఈవో సత్యనారాయణ నుంచి ఆయన బాధ్యతలు అందుకున్నారు. అనంతరం కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన గతంలో కాకినాడ డీఎల్‌డీవోగా పనిచేస్తూ బదిలీపై విశాఖకు వచ్చారు.

18 రోజుల పసికందు అదృశ్యం

- ఏడు గంటల ఉత్కంఠకు తెర
- అనంతరం క్షేమంగా తల్లి చెంతకు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: నగరంలో 18 రోజుల పసికందు అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. ఏడుగంటలు కొనసాగిన హైడ్రామా అనంతరం క్షేమంగా తల్లి చెంతకు చేరడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇందుకు సంబంధించి ఆరిలోవ సీఐ గోవిందరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దంపతులు డొక్కా చంటి భవాని, శివ దంపతులు విశాఖలోని కేంద్ర కారాగానికి ఎదురుగా ఉన్న రామకృష్ణాపురంలో నివాసముంటున్నారు. వీరికి 18 రోజుల కింద ఆడపిల్ల పుట్టింది. సోమవారం తెల్లవారుజాము 2 గంటలకు చంటి భవాని పక్కన నిద్రిస్తున్న చంటిపాప కనిపించటం లేదని శిశువు అమ్మమ్మ మువ్వల మంగ గగ్గోలు పెట్టడంతో స్థానికులంతా అక్కడికి చేరుకున్నారు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కంట్రోల్ రూంకు ఫోన్ చేశారు. 2.30 గంటలకు ద్వారకా జోన్ ఏసీపీ రాంబాబు ఆరిలోవ పోలీసులను అప్రమత్తం చేశారు. ఆరిలోవ సీఐ గోవిందరావు, ఎస్సైలు కృష్ణ, రామదాసు, సిబ్బందితో కలిసి పరిసర ప్రాంతాల్లో వెతకటం ప్రారంభించారు. 3.30 గంటల సమయంలో ఏసీపీ రాంబాబు స్వయంగా రంగంలోకి దిగి గ్రామానికి ఆనుకుని ఉన్న చెరువు, డంపింగ్ యార్డు ప్రాంతాలను స్థానికులతో కలిసి వెతికారు. అయినా ఫలితం లేదు. పెంచుకోవడానికి బంధువులకు ఇచ్చేశామని సుమారు 5 గంటల సమయంలో శిశువు అమ్మమ్మ మంగ చెప్పడంతో అందరూ కంగుతున్నారు. బంధువులు ఉంటున్న కశింకోట మండలం ఏఎస్ పేట గ్రామానికి ముగ్గురు కానిస్టేబుళ్లు వెళ్లారు. ఉదయం 7 గంటలకు శిశువుతో పాటు వారిని ఆరిలోవ పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. 7 గంటల నుంచి 9 గంటల వరకు విచారణ జరిపిన అధికారులు నిర్ధారించుకున్నాక తల్లిదండ్రులకు శిశువును అప్పగించేశారు.



అమ్మమ్మ ఒడిలో శిశువు, పక్కన తల్లి



శిశువు అదృశ్యమైన ఇల్లు

ఆర్థిక పరిస్థితి బాగోలేక ఇలా..

భవాని, శివ తొలి సంతానం ఆడపిల్ల. వీరి ఆర్థిక పరిస్థితి బాగోలేక రెండోసారి ఆడపిల్ల పుడితే కశింకోట ఏఎస్‌పేటకు చెందిన కొల్లా నాగఅప్పారావు దంపతులకు ఇవ్వాలని ముందే ఒప్పందం చేసుకున్నామని శిశువు అమ్మమ్మ మంగ తెలిపారు. కానీ శిశువు పుట్టాక తన అల్లుడు మనసు మార్చుకుని ఇవ్వటానికి అంగీకరించలేదు. దీంతో బంధువుల ఒత్తిడి మేరకు ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో వారికిచ్చి పంపిచేశానని తెలిపింది. కుమార్తె, అల్లుడు కోపగించుకుంటారని కుక్క ఎత్తుకుపోయినట్లు చెప్పానన్నారు. రెండు రోజుల తరువాత చెబుదామని అనుకున్నానని ఇంతలోనే ఇంత జరిగిందని తెలిపారు.


విద్యుదాఘాతంతో మహిళ మృతి



నారాయణమ్మ (పాతచిత్రం)

నక్కపల్లి, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై నక్కపల్లికి చెందిన ఓ మహిళ మృతి చెందినట్లు సీఐ కుమారస్వామి సోమవారం తెలిపారు. ఉపమాక రోడ్డులో నివాసం ఉంటున్న ఆకి నారాయణమ్మ (58) కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం ఇంటి ముందు గేటు తీస్తుండగా విద్యుదాఘాతానికి గురైంది. కుటుంబ సభ్యులు ఆసుపత్రిని తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతురాలి కుమారుడు శివ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ కిశోర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన వృద్ధుడు అస్తిపంజరంగా..



మహాలక్ష్మి (పాతచిత్రం)

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అదృశ్యమైన తండ్రి అందనంత దూరాలకు వెళ్లిపోయాడు. ఇంటికి సమీపంలోనే కళ్లు తిరిగి పడిపోయినా ఎవరూ చూడకపోవడంతో మృతిచెందాడు. అచ్యుతాపురం సీఐ నమ్మి గణేష్ కథనం ప్రకారం.. పూడిమడకకు చెందిన వృద్ధుడు ఎరిపల్లి మహాలక్ష్మి (72) గత నెల 29న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈనెల 3న పోలీసులకు కుమార్తె కోలా చిట్టితల్లి ఫిర్యాదు చేసింది. వీరి బంధువు ఎరిపల్లి ధనలక్ష్మి వంటచెరకు కోసం వెళ్లగా దుర్గంధం వచ్చింది. దగ్గరకు వెళ్లి చూసేసరికి కుళ్లిన ఎముకల గూడు కనిపించడం, పైన దుస్తులు ఉండడంతో అనుమానంతో కుటుంబసభ్యులకు సమాచారం అందించింది. కుటుంబ సభ్యులు దుస్తులను పరిశీలించి మహాలక్ష్మిగా నిర్ధారణకు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. అధిక రక్తపోటు కారణంగా స్పృహతప్పి ఎవరూ చూడకపోవడంతో చనిపోయి ఉంటాడని బంధువులు తెలిపారు.

40 కేజీల గంజాయితో ముగ్గురి అరెస్టు

దేవరాపల్లి: ఒడిశా నుంచి మహారాష్ట్రకు కారులో తరలిస్తున్న 40 కేజీల గంజాయిని దేవరాపల్లి పోలీసులు సోమవారం పట్టుకున్నారు. గంజాయితోపాటు కారు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్సై మల్లేశ్వరరావు చెప్పారు. జోలాపుట్ నుంచి దేవరాపల్లి మీదుగా గంజాయి రవాణా జరుగుతోందన్న ముందస్తు సమాచారంతో శ్రీరాంపురం కూడలిలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో వచ్చిన కారును ఆపి తనిఖీ చేయగా.. డిక్కీలో 40 కేజీల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. కోరాపుట్ జిల్లా నందాపూర్‌కు చెందిన కారు డ్రైవరు మోహన్ భైరాగి, అతడి సోదరుడు పద్మన్ కెముండి, అతుల్ సోనీని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్సై చెప్పారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

పొదల్లో దాక్కున్న నిందితుల పట్టివేత

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: పొదల్లో దాక్కున్న నలుగురు గంజాయి నిందితులను నర్సీపట్నం గ్రామీణ పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. వీరి నుంచి 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై పి.రాజారావు కథనం ప్రకారం.. గబ్బాడ సమీపంలోని సాధూపాకల వద్ద ఆదివారం సాయంత్రం బస్సులను ఆపి పోలీసులు తనిఖీలు చేస్తుండటం గమనించిన గంజాయి స్మగర్లు బస్సు ఆపించి మూటతో దిగిపోయి పొదల్లో కలిసిపోయారు. వీరు పొదల్లోకి వెళ్లడం గమనించిన సిబ్బంది అనుమానంతో వెదికి పట్టుకున్నారు. నిందితులను ఒడిశాలోని కేంద్రపడ జిల్లా షమ్‌సారా గ్రామానికి చెందిన రష్మీరంజన్ సాహు (40), తమిళనాడు రాష్ట్రం చెన్నై నగరంలోని కరుణానిధి నగర్‌కు చెందిన ఆర్ముగం సురేష్‌కుమార్ (37), ముత్తుకుమార్ (30), అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం, గొంది మెలక గ్రామానికి చెందిన బురిడి గురుమూర్తి (32)గా గుర్తించినట్టు ఎస్సై వివరించారు. వీరి నుంచి ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని, నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.



పట్టుబడిన నిందితులు

విశాఖ వచ్చే రైళ్ల సమయాల్లో మార్పు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: న్యూదిల్లీ, ముంబయి, చెన్నై, హైదరాబాద్, కోర్బా, మచిలీపట్నం, నాందేడ్, బ్రహ్మపుర, కాకినాడ పోర్టు, భవానీపట్నా, గాంధీధామ్, దుర్గ్, తిరుపతి, లోకమాన్య తిలక్, రాయపూర్, కిరండూల్, గుణుపురం, సికింద్రాబాద్, కొల్లాం ప్రాంతాల నుంచి విశాఖకు తిరుగు ప్రయాణమయ్యే పలు రైళ్లు. . గమ్యస్థానానికి 5 నుంచి 25 నిమిషాలు ఆలస్యంగా చేరుకునేలా వేళలు మార్పు చేసినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ఈనెల 15వ తేదీ నుంచి కొన్ని రైళ్లకు ఈ సమయాలు అందుబాటులోకి రానుండగా మరికొన్నింటికి 18, 19, 20 తేదీల నుంచి వర్తించనున్నట్లు పేర్కొన్నాయి.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	137	130
డ్రెస్‌డ్	199	230
స్కిన్‌లెస్	226	240

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: **దేవర** పర్తిసాయి: **కలి** సత్యనారాయణ స్క్రీన్-1: **రామ్‌నగర్ బన్నీ** స్క్రీన్-2: **మత్తు వదలరా-2** వెంకటేశ్వర: **దక్షిణ** శ్రీ సత్య: **జెంటిల్‌మేన్** రామచంద్ర: **శ్వాగ్** షిర్డిసాయి: **సత్యం సుందరం** **అచ్యుతాపురం:** శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **శ్వాగ్** స్క్రీన్-2: **దేవర**

నిలిచిన నీటి సరఫరాతో అవస్థలు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో సోమవారం తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదివారం పైపులైన్ పగిలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నా అవి పది శాతం ప్రాంతాలకు అందడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

గ్రంథాలయంలో అందుబాటులో లేని పుస్తకాలు

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: దుర్గాకాలనీ ప్రాంతంలోని పూర్వ గ్రంథాలయంలో పుస్తకాలు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. గతంలో ఈ గ్రంథాలయానికి విశాలమైన సొంత భవనాన్ని నిర్మించి పూర్తి మౌలిక వసతులతో పాఠకులకు అందుబాటులోకి తెచ్చారు. గ్రామానికి దూరంగా ఉందని చెప్పి కొంతమంది అప్పటి కాంగ్రెస్ నాయకులు గవర్రాజు పార్కులోని భవనం నిర్మించి ఇక్కడి పుస్తకాలు, గ్రంథాలు తరలించారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో కొన్ని ఏళ్లపాటు పాత గ్రంథాలయాన్ని మూసి వేశారు. దీనిపై దృష్టి సారించిన అప్పటి, ప్రస్తుత ఎమ్మెల్యే అనిత సుమారు రూ. 3.50 లక్షలు మంజూరు చేసి పాత భవనానికి మరమ్మతులు చేయించారు. కేవలం దిన పత్రికలు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయని, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, ఇతర పుస్తకాలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దుర్గాకాలనీలోని పూర్వ గ్రంథాలయం

దసరాకు కందిపప్పు

డిపోలు: 1063
కార్డుదారులు 5,47,312
రేషన్ వాహనాలు: 374

కలెక్టరేట్, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం కార్డుదారులకు కందిపప్పు, పంచదార పంపిణీకి చర్యలు ప్రారంభించింది. గత వైకాపా ప్రభుత్వం గడిచిన గత రెండేళ్లుగా వీటి పంపిణీ నిలిపేసింది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సరకుల్లో తేడాలు గుర్తించింది. సరకుల తూకం 50 గ్రాముల వరకు తక్కువగా ఉన్నట్లు గుర్తించి వీటిని సరఫరా నిలిపివేసింది. గోదాముల్లో తనిఖీలు చేపట్టి తేడాలు గుర్తించింది. ఇటువంటి సరకులను వెనక్కి పంపించి కచ్చితమైన తూకంతో కొత్తగా ప్యాకింగ్ చేయించారు. వైకాపా హయాంలో గత రెండేళ్లలో ఒక్క బియ్యం మాత్రమే పూర్తి స్థాయిలో కార్డుదారులకు అందించింది. కూటమి ప్రభుత్వం సరకులన్నీ పూర్తి స్థాయిలో అందేలా చర్యలు ప్రారంభించింది. నిలిచిపోయిన కందిపప్పు, పంచదార పంపిణీకి శ్రీకారం చుట్టి గత నెలలో పంచదార అందించింది. ఈనెలలో కందిపప్పు సరఫరా పునప్రారంభించేలా చర్యలు చేపట్టింది. దసరా పండగకు కందిపప్పు పంపిణీ చేస్తుండడంతో కార్డుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో రాబోయే అన్ని పండుగులకు రేషన్ సరకుల్లో కోత లేకుండా పూర్తి స్థాయిలో అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో సోమవారం నుంచి ఎండీయూ వాహనాల ద్వారా సరకులు పంపిణీ ప్రారంభించారు.

సరకుల పంపిణీ ఇలా

జిల్లాలో 5,47,312 మంది కార్డుదారులు ఉన్నారు. వీరికి 7747 మెట్రిక్ టన్నులు బియ్యం, 270 మెట్రిక్ టన్నుల పంచదార పూర్తి స్థాయిలో కార్డుదారులకు అందించనున్నారు. 546 మెట్రిక్ టన్నులు కందిపప్పు అవసరం కాగా 50 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. 210 మెట్రిక్ టన్నులు సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. కేజీ కందిపప్పు రూ. 67 చొప్పునే కార్డుదారులకు అందిస్తున్నారు. ప్రాధాన్యత క్రమంలో వచ్చిన ఈ కందిపప్పును తొలుత పట్టణ ప్రాంతాల్లో పంపిణీ చేస్తున్నారు. మరో దఫాలో మిగిలిన కందిపప్పు రాగానే అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ దుకాణాలకు అందిస్తామని పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు.



ప్యాకెట్లపై తొలగిన రంగులు, ప్రచార పోస్టర్లు



గతంలో రేషన్ దుకాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా లబ్ధిదారులకు ఏ సరకులు పంపిణీ చేసిన పచ్చరంగులతో ప్యాకింగ్, పెద్దగా ముద్రించి జగన్ బొమ్మలు దర్శనమిచ్చేవి. తాజాగా పంపిణీ చేసిన పంచదార, కందిపప్పు ప్యాకెట్లలతో ఎలాంటి ప్రచార ఆర్భాటాలు బొమ్మలు, రంగులు, చిత్రాలకు తావులేకుండా ప్యాకింగ్ చేసి పంపిణీ చేస్తున్నారు. కందిపప్పు ప్యాకెట్‌పై కందిపప్పు వివరాలు, ఎన్ని నెలలు నిల్వ ఉంటుంది, సప్లై డీలర్ వివరాలు తదితర వివరాలు స్టిక్కర్ రూపంలో ముద్రించారు. తూకంలో ఎలాంటి తేడా లేకుండా కచ్చితమైన ప్యాకింగ్‌తో అందిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ. 163 ఉండే కందిపప్పును రూ. 67కు అందిస్తున్నారు. త్వరలో గోధుమపిండి, రాగులు, జొన్నలు సైతం కార్డుదారులకు ఇవ్వడానికి కసరత్తు చేస్తున్నారు.

శునకం.. వానరం.. వరాహం

గుంపులుగా సంచారం

ఎలమంచిలి పట్టణం, న్యూస్‌టుడే: ఎలమంచిలి పట్టణ పరిధిలో శునకాలు, కోతులు, పందుల బెడద తీవ్రమైంది. ఇవి గుంపులుగా తిరుగుతున్నాయి. రాత్రి సమయాల్లో ప్రజలు రాకపోకలు సాగించాలంటే భయాందోళన చెందుతున్న పరిస్థితి నెలకొంది. పెద్దలు, చిన్నారులనే తేడా లేకుండా ఇవి వెంటాడి దాడి చేస్తున్నాయి. ఆదివారం మిలట్రీ కాలనీ ఒక మహిళపై గుంపులుగా కోతులు దాడి చేసి గాయపరిచాయి. కోర్టుపేట, రామనగర్ ప్రదేశాల్లో పందుల బెడద తీవ్రమైంది. మిలట్రీకాలనీ, రామ్‌నగర్, ఉలక్‌పేట తదితర ప్రాంతాల్లో ఒంటరిగా తిరిగేందుకు స్థానికులు భయపడుతున్నారు. ప్రధాన వీధుల్లో కొన్ని చోట్ల కుక్కలు వాహనచోదకులను వెంబడించి మరీ గాయపరుస్తున్నాయి. పలుమార్లు ఇళ్లలోకి చేరి పండ్లు, సరకులను నోటకరుచుకుని పారిపోతున్నాయి.



మిలట్రీకాలనీలో సంచరిస్తున్న కోతులు

గత ఏడాది కూడా పట్టణంలో ఇదే పరిస్థితి నెలకొంది. కుక్కలకు సంతాన నిరోధక చికిత్సలు చేసి అదుపు చేస్తామని అధికారులు హామీ ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల కుక్కలు దాడి చేసినా అందుబాటులో చికిత్స అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో సమయానికి మందులు దొరకక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించక తప్పడంలేదు. అధికారులు స్పందించి వీటి అదుపునకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావును వివరణ కోరగా కోతులను పట్టుకునేలా త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యాధికారుల సాయంతో కుక్కలకు సంతాన నిరోధక చికిత్సలు చేయిస్తామని చెప్పారు.



గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

భూ వివాదాలే అధికం..

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: చట్ట పరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించేలా పోలీస్ సిబ్బంది చొరవ చూపాలని జిల్లా ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 33 ఫిర్యాదులు అందాయి. వీటిలో సగానికి పైగా భూ వివాదాలే ఉన్నాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటిని సంబంధిత స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలకు పంపుతూ చట్టపరిధిలోని సమస్యను వెంటనే పరిష్కరించాలి ఆదేశాలు జారీ చేశారు. అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

భూ సమస్యపై తిరుగుతున్నాను.... అనకాపల్లిలో 60 సెంట్ల భూమి నాకు ఉంది. నా భూమిలోకి నన్ను రానీయకుండా అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. న్యాయం చేయాలి.

– దాడి కనక పరమేశ్వరమ్మ, అనకాపల్లి

భూ ఆక్రమణకు ప్రయత్నం.. 1980 నుంచి భూమి సాగు చేసుకుంటున్నాను. భూ పట్టా కోసం తిరుగుతుంటే ఇవ్వడం లేదు. సాగు చేసుకుంటున్న భూమిలోకి మరికొందరిని పంపి ఆక్రమించాలని చూస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలి. – కోడూరు అప్పారావు, గుడ్డిప, రావికమతం మండలం

అ వీ ఇ వీ

న్యాయం చేయాలి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జీవిత బీమా ఏజెంట్లకు న్యాయం చేయాలని కోరుతూ అనకాపల్లిలో ఎల్ఐసీ ఏజెంట్లు అనకాపల్లి బ్రాంచి మేనేజర్‌కి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఐఆర్‌డీఏ ప్రవేశపెట్టిన ఏజెంట్ల వ్యతిరేక విధానాలు వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏజెంట్ల యూనియన్ ప్రతినిధులు సైదునాయుడు, కరణంమాణిక్యాలరావు, సూరిఅప్పారావు పాల్గొన్నారు.

వరద బాధితురాలికి చేయూత

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: తుమ్మపాల ఇందిరానగర్ కాలనీలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇంటిని కోల్పోయిన బాధితురాలికి సోమవారం రెల్లి మేధావుల సంఘం నాయకులు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు బండి ఆది సురేంద్ర మాట్లాడుతూ రెల్లి కులస్థులకు ఏకష్టం వచ్చినా సంఘం ద్వారా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. విజయవాడ వరద బాధితులకు అవసరమైన నిత్యావసర సరకులను పంపించినట్లు పేర్కొన్నారు. సంఘం కార్యదర్శి కోన శివగణేష్, కిరణ్‌కుమార్, అప్పారావు, దుర్గేశ్వరరావు పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న నాయకులు

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు

మునగపాక, న్యూస్‌టుడే: అంకితభావంతో విధులు నిర్వహించే ఉద్యోగులకు ప్రజలలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని పాటిపల్లి సర్పంచి ఆడారి కృష్ణవేణి అన్నారు. పాటిపల్లి కార్యదర్శిగా విధులు నిర్వహించి బదిలీ అయిన చింతపల్లి మెహర్ ప్రసాదును సోమవారం ఘనంగా సత్కరించారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

నక్కపల్లి, న్యూస్‌టుడే: పరిశ్రమల ఏర్పాటుకు సేకరించిన భూముల నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని తెదేపా మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ నరసింహమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. తెదేపా హయాంలో దాదాపుగా పరిహారం చెల్లింపులు చేశారన్నారు. కొంతమందికి పరిహారం రావాల్సి ఉందని తెలిపారు. ఇక్కడ ఇబ్బందులు తొలగించి, అక్రమాలు ఉంటే వాటిపై దృష్టి సారించాలన్నారు. అనంతరం తహసీల్దార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైబోయిన రమణ, దార్ల కృష్ణ, అయినంపూడి అప్పలరాజు, పెదపూడి శంకరరావు, పిక్కి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

?: అనకాపల్లిలోని జాతీయరహదారిలో లైట్లు వెలగడం లేదు. అంధకారం అలముకుంటోంది. సమస్యను పరిష్కరించగలరు.

– కె. స్వామి, అనకాపల్లి

✓: మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. – నానాజీ, జీవీఎంసీ విద్యుత్ విభాగం జోనల్ ఏఈ, అనకాపల్లి.

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే

?: పాయకరావుపేటలోని నాగరాజుపేట ప్రాంతంలో వారం రోజులుగా విద్యుత్తు వీధిదీపాలు వెలగడం లేదు. చీకటి కారణంగా రాత్రి వేళ నిత్యం చిల్లర దొంగతనాలు జరుగుతున్నాయి. – స్థానికులు, పాయకరావుపేట

✓: వెంటనే వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – నాగార్జున, విద్యుత్తు సిబ్బంది

మార్కెట్ యార్డులో వాకింగ్ ట్రాక్: కొణతాల



ట్రాక్ ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కొణతాల

అనకాపల్లి, న్యూస్‌టుడే: బెల్లం మార్కెట్ యార్డులో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. యార్డులోని ట్రాక్ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం మార్కెటింగ్‌శాఖ జిల్లా అధికారి రవికిరణ్, మార్కెట్ కమిటీ కార్యదర్శి శకుంతలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ పురుషులు, మహిళలకు వేరువేరుగా జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. యార్డులో రూ. 1.55 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. నాయకులు తాడి రామకృష్ణ, పీలా నాగశ్రీను, భరత్, ఆళ్ల రాము, బొడ్డేడ శేషు, చదరం నాగేశ్వరరావు, సకల గోవింద పాల్గొన్నారు.

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కొణతాల కోరారు. పట్టణంలో గౌరీ సేవా సంఘం అధ్వర్యంలో విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ప్రతినిధులు మళ్ల సాంబశివరావు, గౌరీ సేవా సంఘం అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఉపాధ్యక్షులు ఆళ్ల మహాలక్ష్మినాయుడు పాల్గొన్నారు.

అత్యవసర పనులపై దృష్టిపెట్టండి

అచ్యుతాపురం, మునగపాక, న్యూస్‌టుడే: అత్యసరంగా చేపట్టాల్సిన పనులపై దృష్టిపెట్టాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కోరారు. అచ్యుతాపురంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అచ్యుతాపురం కూడలి విస్తరణకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆర్‌అండ్‌బీ డీఈ.రాధాకృష్ణ, జేఈలు లలిత, ఎస్.పద్మని, ఎం.సత్యవాణి పాల్గొన్నారు. హరిపాలెంలో నిర్వహించే దసరా ఉత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యేను కమిటీ ప్రతినిధులు కోరారు. హరిపాలెం మాజీ సర్పంచి కాంగ్రేగులు సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఉత్సవకమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. నాగులాపల్లిలో నిర్మించిన మైదానాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడారంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. విద్యతోపాటు క్రీడల్లోనూ సత్తా చాటాలన్నారు. నియోజకవర్గాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, మండల తెదేపా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, మండల జనసేన అధ్యక్షుడు టెక్కలి పరశురామ్, సర్పంచి జామి చినమ్మలు, గోసాల గోవిందరాజులు, కొరపాటి రాజశేఖర్, కాంగ్రేగుల నాయుడు, పొలమరశెట్టి నాగు, సరోజని, యల్లపు శ్రావణ్‌కుమార్, బొడ్డేడ అప్పలనాయుడు, మళ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్



అనకాపల్లిలో..



చిన్నారుల ప్రదర్శన



పీలా గోవిందను సత్కరిస్తున్న ప్రతినిధులు



హరిపాలెంలో..

లలితా త్రిపురసుందరీదేవిగా కనకదుర్గ

అనకాపల్లి/ పట్టణం, కొత్తూరు, లక్ష్మీదేవిపేట, నెహ్రూచౌక్, కశింకోట, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అనకాపల్లిలో సతకంపట్టు కనకదుర్గ అమ్మవారు సోమవారం లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నూకాలమ్మ ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహించారు. కన్యకా పరమేశ్వరిని రాజరాజేశ్వరి అలంకరించారు. చిన్నారులు యషిక, లాశ్రీ లవకుశ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. బాల త్రిపురసుందరి దేవిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. కల్యాణగిరిపై ఉన్న శ్రీకనకదుర్గమ్మకు లలితా త్రిపుర సుందరీదేవి అలంకరించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గవరపాలెంలో దుర్గాదేవిని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దర్శించుకున్నారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు. లక్ష్మీదేవిపేటలోని కనకదుర్గాదేవి లలితా త్రిపుర సుందరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భవానీ భక్తులు అగ్నిగుండం తొక్కి భక్తి చాటుకున్నారు. గవరపాలెం శ్రీగౌరీ పంచాయతన దేవాలయంలో కొలువుదీరిన గౌరీపరమేశ్వరికి భక్తులు సారె సమర్పించారు. గౌరీ సంఘం అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామసత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఆళ్ల మహాలక్ష్మినాయుడు, సురేష్, వెంకటరమణ పాల్గొన్నారు. శ్రీకామాక్షి దేవి అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఎస్.భారతి హరికథా గానం అలరించింది. పిసినికాడ కనకదుర్గమ్మ మహాచండీదేవీగా పూజలందుకున్నారు. అమ్మవారి ఘటాలను భక్తులు గ్రామంలో ఊరేగించి అగ్నిగుండాలను తొక్కారు.



సతకంపట్టులో..



మునగపాకలో..



నక్కపల్లిలో..

అచ్యుతాపురం, మునగపాక, న్యూస్‌టుడే: హరిపాలెం-అందలాపల్లి శ్రీభగీరథీ అమ్మవారిని తెదేపా రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కర్రి సాయికృష్ణ, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు భీమరశెట్టి శ్రీనివాసరావు, పెంటకోట విజయ్ దర్శించుకొని పూజలు చేశారు. మునగపాక నందీశ్వరప్రాంగణంలో అంబలం పూజ నిర్వహించారు.

నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల, న్యూస్‌టుడే: నక్కపల్లి చేనేత కాలనీలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. కాగిత కనకదుర్గమ్మ మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. పెదగుమ్ములూరు దుర్గాదేవి మండపంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అడ్డురోడ్డు, ధర్మవరం-అగ్రహారం ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కైలాసపట్నంలో విద్యుత్తు దీపాలంకరణ ఆకట్టుకుంది. అమ్మవారి పీఠంతోపాటు సుమారు 2 కిలోమీటర్ల మేర భారీ విద్యుత్తు దీపాలంకరణ చేపట్టారు.



సారె ఊరేగింపులో భక్తులు

విద్యార్థుల ఇళ్ల సందర్శన

కశింకోట, న్యూస్‌టుడే: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యమని గణిత ఉపాధ్యాయులు ఏవీఎన్.మూర్తి అన్నారు. వెదురుపర్తిలో సోమవారం 'విద్యార్థి మేలుకో' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు విద్యార్థుల ఇళ్లను సందర్శించి వారికి ప్రేరణ కలిగిస్తూ చదివిన అంశాలను ఉపాధ్యాయులు పరిశీలిస్తారన్నారు. పిల్లలకు అందించే పోషకాహారంపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి సలహాలు, సూచనలు ఇస్తారని, పరీక్షలు పూర్తయ్యే వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.



వెదురుపర్తిలో పుస్తకాలను పరిశీలిస్తున్న ఏవీఎన్ మూర్తి

ప్రతి గ్రామంలో ధార్మిక సమితి

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి గ్రామంలో 22 మందితో ధార్మిక సమితిని ఏర్పాటు చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ధర్మప్రచారక్ సాయిరాం కోరారు. రాజగోపాలపురం గ్రామంలో నియోజకవర్గస్థాయి గ్రామ కన్వీనర్ల శిక్షణ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కమిటీల ద్వారా దేవాలయాల్లో నిత్యం ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు భజనలు, సామూహిక హారతులు, నగర సంకీర్తనలు వంటివి నిర్వహించాలన్నారు. రాబోయే ధనుర్మాసం నెలలో తెల్లవారుజాము నుంచే మేలుకొలుపు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రతినిధులు చంద్రమాల కొండయ్య, పోతు రంగారావు, నీలాపు వెంకటరెడ్డి, జగతా శ్రీనివాసరావు, కోనాడ చిట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు భక్తుల నీరాజనం

నక్కపల్లి, న్యూస్‌టుడే: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరువీధుల్లో ఊరేగుతున్న ఉత్సవమూర్తులకు భక్తులు నీరాజనాలు పలికారు. ఉదయం విశేష పూజల తర్వాత బలిహరణ గావించిన ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, ఉత్సవమూర్తులను ఆంజనేయ వాహనంలో అలంకరించారు. తర్వాత సన్నాయి, వాయిద్యాలతో తిరువీధుల్లో ఊరేగగా, భక్తులు హారతులు పట్టి దర్శనాలు చేసుకున్నారు. అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు, ఇనస్పెక్టర్ కూర్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయ వాహనంలో ఊరేగింపు

సీఎస్ఆర్ నిధులతో వీధి దీపాలను ఏర్పాటు చేయండి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: సామాజిక బాధ్యతా నిధులతో (సీఎస్ఆర్) పూడిమడక పంచాయతీ పరిధిలో వీధి దీపాలను ఏర్పాటు చేయించాలని గ్రామస్థులతో కలిసి సర్పంచి చేపల సుహాసిని ఏపీఐఐసీ జెడ్ఎం హరిప్రసాదరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. సౌర విద్యుత్తుతో వెలిగే దీపాలను నెలకొల్పాలన్నారు. సేకరించిన భూములకు ఏపీఐఐసీ పరిహారం ఇవ్వకపోయినా రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఏపీఐఐసీకి చెందిన భూమిగా పేర్కొన్నారన్నారు. వన్‌బీలో రైతుల పేరుకు బదులు ఏపీఐఐసీకి చెందిన భూమిగా నమోదు చేశారని తెలిపారు. దీనిపై విచారణ చేసి తమకు చెందిన భూములను ఏపీఐఐసీ జాబితా నుంచి తొలగించాలని కోరారు. మాజీ సర్పంచి చేపల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



జెడ్ఎంకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మండల సమాఖ్య అధ్యక్షురాలిగా శివలక్ష్మి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం డ్వాక్రా మండల సమాఖ్య అధ్యక్షురాలిగా మడుతూరుకు చెందిన సత్తాడ శివలక్ష్మి నియమితులయ్యారు. వెలుగు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. కార్యదర్శిగా పూడిమడకకు చెందిన మడ్డు అనురాధ, కోశాధికారి దొప్పెర్లకు చెందిన సబ్బవరపు పద్మ, ఉపాధ్యక్షురాలిగా ఎం.జగన్నాథపురానికి చెందిన సీహెచ్.దుర్గాదేవి, సంయుక్త కార్యదర్శి రాజానపాలెంనకు చెందిన విజయలక్ష్మిలకు అవకాశం ఇచ్చారు ఏపీఎం శ్రీనివాస్ వీరితో ప్రమాణం చేయించారు.



ప్రమాణం చేస్తున్న ప్రతినిధులు

దాడులు ఆపాలి

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: పాలస్తీనాలోని గాజాపై దాడులు వెంటనే నిలిపివేయాలని వామపక్ష పార్టీల ప్రతినిధులు సోమవారం అనకాపల్లి పట్టణంలో ర్యాలీ చేసి, కూడళ్లలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీల ప్రతినిధులు జి.కోటేశ్వరరావు, వైఎన్ భద్రం, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ, అల్లు రాజు, పి.శ్రీనివాసరావు, ఈశ్వరరావు, కోరిబిల్లి శంకరరావు తదితరులు మాట్లాడారు. దాడులు నిలిపివేసేలా ప్రపంచ నేతలంతా కృషి చేయాలని కోరారు.



వామపక్ష నాయకుల నినాదాలు

అడ్డురోడ్డు మార్గం.. అధ్వానం

కోటవురట్ల, న్యూస్‌టుడే: నర్సీపట్నం-అడ్డురోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారి పిచ్చి మొక్కలతో అధ్వానంగా తయారైంది. యండపల్లి దగ్గర నుంచి రామచంద్రపురం వరకు రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. గొట్టివాడ, పాత రోడ్డు, కైలాసపట్నం, రామచంద్రపురం సమీపంలోని మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరస్థితి. ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు

పండగకు జీతాలిప్పించండి..!

ఎలమంచిలి, న్యూస్‌టుడే: దసరా పండగకు అయినా బకాయిపడిన జీతాలు ఇప్పించాలని కోరుతూ సోమవారం ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఒప్పంద కార్మికులు ధర్నా చేపట్టారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఒప్పంద పద్ధతిలో వివిధ విభాగాల్లో పనిచేసే కార్మికులకు నెలలు తరబడి బకాయిలు చెల్లించలేదన్నారు. మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ్, నాయకులు తాటి పాకల చిన్న అప్పారావు, మడక శ్రీనివాస్, అనిల్ శ్రీనివాస్, సంతోషి, రత్నం, రమణమ్మ పాల్గొన్నారు.



ఆసుపత్రి ఎదుట కార్మికుల ధర్నా

కోనాం నీటి విడుదల

చీడికాడ, న్యూస్‌టుడే: కోనాం జలాశయం నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరడంతో స్పిల్‌వే, తూముల నుంచి 180 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 99.80 మీటర్లుగా ఉందని ఏఈ జయరామ్ చెప్పారు. ఎగువ ప్రాంతాల నుంచి 60 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు.

కోనాం నీటి విడుదల



చీడికాడ, న్యూస్‌టుడే: కోనాం జలాశయం నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరడంతో స్పిల్‌వే, తూముల నుంచి 180 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 99.80 మీటర్లుగా ఉందని ఏఈ జయరామ్ చెప్పారు. ఎగువ ప్రాంతాల నుంచి 60 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు.

కోనాం జలాశయం నుంచి విడుదలవుతున్న వరదనీరు


నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

చూస్తుండగానే చుట్టేశాయి!



పొర్లుపాలెం సమీపంలో..



తట్టబంద - కసిరెడ్డిపాలెం మార్గంలో..



కసిరెడ్డిపాలెం సమీపంలో..

స్తంభాలు వేశామా.. తీగలు లాగామా అన్నంత వరకే విద్యుత్తు అధికారులు, సిబ్బంది పరిమితమవుతున్నారు. విద్యుత్తు లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు, స్తంభాలకు అల్లుకుపోతున్న పాదులను తొలగించడంపై పెద్దగా దృష్టిసారించడం లేదు. అప్పుడప్పుడు సరఫరాను నిలిపివేసి కొమ్మలను తొలగిస్తున్నారు.. పాదులను చూసీచూడనట్టుగా వదిలేస్తున్నారు. తట్టబంద నుంచి కసిరెడ్డిపాలెం వరకు 30కుపైగా స్తంభాలు ఉండగా.. పలు చోట్ల అవి కనిపించకుండా పాదులు చుట్టేశాయి. తట్టబంద విద్యుత్తు ఉప కేంద్రం నుంచి సాయినగర్, ఎల్.ఎన్.పురం, బూరుగుపాలెం, పొర్లుపాలెం, కసిరెడ్డిపాలెం గ్రామాలకు విద్యుత్తు సరఫరా అవుతోంది. చీడికాడ మండలం అప్పలరాజుపురం - బి.సింగవరం మార్గంలో విద్యుత్తు సంభానికి పొదలు అల్లుకున్నాయి గాలులకు చెట్ల కొమ్మలు తీగలకు తగిలి సరఫరా నిలిచిపోతోందని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్తు సిబ్బంది దృష్టిసారించి చెట్ల కొమ్మలతోపాటు పాదులను తొలగించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, రావికమతం, చీడికాడ

రోగులకు మరింత మెరుగైన వైద్యం

నర్సీపట్నం ఆసుపత్రిలో వసతుల మెరుగుకు సన్నాహాలు



ఔట్‌పేషెంట్ విభాగంగా వినియోగించనున్న భవనం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆసుపత్రికి నర్సీపట్నం చుట్టుపక్కల ఆరు మండలాల ప్రజలతోపాటు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కొయ్యూరు, చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల నుంచి రోజూ వందలాది మంది రోగులు వస్తుంటారు. ప్రమాదాల్లో గాయపడిన వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం తీసుకొస్తుంటారు.

● నర్సీపట్నం వస్తున్న రోగుల్లో మెరుగైన వైద్యం అవసరమైన చాలామంది ఇక్కడి నుంచి విశాఖపట్నం తరలిస్తుంటారు. అందుకు కారణం ఇక్కడ సీటీ స్కాన్ సదుపాయం లేకపోవడమే. దాదాపు రూ. 1.5 కోట్ల విలువైన సీటీ స్కాన్ యంత్రం అవసరమని గుర్తించి ఈ మేరకు ప్రతిపాదనలు పంపారు. రేడియాలజిస్టుని తాత్కాలికంగా విశాఖపట్నం కేజీహెచ్ నుంచి డిప్యుటేషన్‌పై తీసుకురావాలని యోచిస్తున్నారు. ప్రస్తుతం నర్సీపట్నంలో ప్రైవేట్‌గా సీటీ స్కాన్ చేయించుకోవాలంటే రెండు నుంచి మూడువేల రూపాయల వరకు వెచ్చించాల్సి వస్తోంది. ఆసుపత్రిలోనే అందుబాటులో ఉంటే పేదలకు వ్యయ, ప్రయాసలు తప్పుతాయి. అనుభవజ్ఞులైన ఎముకల వైద్యుడుంటే శస్త్రచికిత్సలు ఇక్కడే చేయవచ్చు. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని విశాఖ పంపిస్తున్నారు.

● ఆసుపత్రిలో ఔట్ పేషెంట్ విభాగంలో మెరుగైన సేవలందించేందుకు రూ. 8.85 కోట్ల ఖర్చుతో కొత్తగా భవనం నిర్మించారు. దీనిని ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి వినియోగంలోకి తీసుకు వచ్చినా పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం లేదు. గ్రౌండ్‌ఫ్లోర్ మొత్తాన్ని పార్కింగ్‌కు వినియోగిస్తున్నారు. మొదటి అంతస్తులో ఔట్‌పేషెంట్ విభాగం నిర్వహించాల్సి ఉన్నా ఇప్పటివరకు ఈ విభాగాన్ని దీంట్లోకి తరలించలేదు. ప్రస్తుతం ఈ భవనాన్ని చర్మవ్యాధులు, లైంగిక సంబంధిత వ్యాధుల నివారణ విభాగానికి వినియోగిస్తున్నారు. పాత భవనాన్ని పూర్తిగా ఇన్‌పేషెంట్ల కోసం వినియోగించనున్నారు. రెండో అంతస్తు పరిపాలనా విభాగానికి వినియోగించుకోవాలని యోచిస్తున్నారు.



ఔట్‌పేషెంట్ నమోదు కేంద్రం వద్ద రద్దీ

● ఆసుపత్రిలో ప్రైవేట్-ప్రభుత్వ భాగస్వామ్యంతో డయాలసిస్ యూనిట్ నడుస్తోంది. 60 మంది వరకు ఇక్కడ రక్తశుద్ధి కోసం వస్తున్నారు. విస్తరణ అవకాశం లేకపోవడంతో కొత్తగా వచ్చేవారికి సమయాన్ని కేటాయించ లేకపోతున్నారు. ఔట్‌పేషెంట్ విభాగం కొత్త భవనంలోకి మారితే మరింత స్థలం అందుబాటులోకి వస్తుంది. యూరాలజీ విభాగాన్ని సైతం నిర్వహించేందుకు వీలుంటుంది. కిడ్నీలో రాళ్ల తొలగింపు వంటి సేవలు ఇక్కడే అందించేందుకు వీలుంటుంది.

సభాపతి సహకారంతో...



ప్రాంతీయ ఆసుపత్రి అభివృద్ధికి శాసనసభాపతి అయ్యన్న సంసిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే ఆయన కొన్ని ప్రతిపాదనలు పరిశీలిస్తున్నారు. త్వరలోనే అభివృద్ధి పనులు మొదలవుతాయి. ఇటీవల అయ్యన్న, జిల్లా కలెక్టర్ ఆసుపత్రి సందర్శించి ఇచ్చిన సూచనల మేరకు పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపరిచాం. కాలువలన్నీ శుభ్రం చేయించాం. ఏ సేవలు మెరుగుపరచాలన్నది ఆయన దృష్టికి తీసుకువెళతాం. రోగులందరికీ మెరుగైన సేవలు అందించాలన్నదే లక్ష్యం.

– డాక్టర్ సత్యనారాయణ, ప్రాంతీయ ఆసుపత్రి ఇంఛార్జి సూపరింటెండెంట్

గెడ్డలు పొంగితే రాకపోకలకు ఇక్కట్లు



జుత్తాడ మార్గంలో వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

కె.కోటపాడు, న్యూస్‌టుడే: గుల్లిపల్లి ఊటగెడ్డ కాజ్‌వే నుంచి హిమగిరి కాలనీకి వెళ్లే మార్గంలో గెడ్డపై వంతెన లేదు. గెడ్డ పొంగితే రాకపోకలు నిలిచిపోతున్నాయి. సింగందొరపాలెం సమీపంలోని కాముగెడ్డపై, చౌడువాడ దరి గవరపేట నుంచి చల్లావారి కళ్లాలకు వెళ్లే సెలగల గెడ్డపైనా వంతెనలు నిర్మించాల్సి ఉంది. చౌడువాడ నుంచి జుత్తాడ వెళ్లే మార్గంలో శారదా నదిపై వారధి నిర్మిస్తే గోవాడ చక్కెర కర్మాగారానికి రైతులు చెరకును తరలించేందుకు మార్గం సుగమం అవుతుంది. కె.కోటపాడు మండలం నుంచి చోడవరం మండలానికి వెళ్లే వారికి దగ్గరి దారిగా ఉంటుంది. స్థానిక ప్రజాప్రతినిధులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: **జోకర్ ఫోలి అడు, కలి, సత్యం సుందరం,** ఆడి2: **స్వాగ్** ఆడి3: **దేవర,** ఆది4: **దేవర, సత్యం సుందరం** రాజు:**స్వాగ్,** బంగార్రాజు: **దేవర**
చోడవరం: శ్రీసాయిలక్ష్మి: **సత్యం సుందరం,** సాయిలక్ష్మి: **స్వాగ్,** పూర్ణా: **దేవర**

అ వీ ఇ వీ

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

చోడవరం పట్టణం: అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని మండల విద్యాశాఖాధికారి సింహాచలం సూచించారు. స్థానిక కోఆపరేటివ్ కాలనీలో సైనిక్, నవోదయ పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులకు సోమవారం అభినందన సభ జరిగింది. అత్యధిక స్కోర్ సాధించిన విద్యార్థులకు నగదు, జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయుడు గోవింద్, శివాజీ పాల్గొన్నారు.

హౌసింగ్ ఏఈగా రామకృష్ణ

రోలుగుంట: గృహనిర్మాణ సంస్థ మండల సహాయ ఇంజినీరుగా రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ప్రేమానందం నర్సీపట్నం బదిలీ కాగా.. అక్కడి నుంచి రామకృష్ణ ఇక్కడకు వచ్చారు.

ఇన్‌ఛార్జి తహసీల్దారుగా సోమశేఖర్

మాకవరపాలెం, న్యూస్‌టుడే: మాకవరపాలెం మండల ఇన్‌ఛార్జి తహసీల్దారుగా సోమశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దారు ఎం.వి.వి.ప్రసాదరావు బదిలీ అయ్యారు. ఇన్‌ఛార్జి బాధ్యతలు స్వీకరించిన సోమశేఖర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు.

● మాకవరపాలెం: మాకవరపాలెం వెలుగు కార్యాలయం ఏపీఎంగా మంగ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏపీఎంగా పనిచేసిన చినబాబు కె.కోటపాడుకు బదిలీ కాగా, రోలుగుంట మండలం నుంచి మంగ ఇక్కడకు వచ్చారు.

వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత

గొలుగొండ: వన్యప్రాణుల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అటవీశాఖ సెక్షన్ అధికారి రామానుజులు కోరారు. కొత్త ఎల్లవరంలో సోమవారం వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం నిర్వహించి మాట్లాడారు. కరక, జిల్లేడిపూడి అటవీ ప్రాంతంలో సంచరించే అడవి పందులు, కణుజులను వేటాడరాదని చెప్పారు. స్థానిక సర్పంచి రాంబాబు పాల్గొన్నారు.

జీడి రైతుల సమస్యలపై ఉద్యమం

దేవరాపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో జీడి రైతుల సమస్యలపై దశలవారీగా ఉద్యమం చేపట్టనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న పేర్కొన్నారు. మండలంలోని జీడిరైతులతో సోమవారం సమావేశమయ్యారు. జీడిమామిడి పంటకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాలని డిమాండు చేశారు. నష్టాల్లో ఉన్న జీడిమామిడి రైతులను ఆదుకోవాలని కోరారు.

యువకుల గొడవ.. నిలిచిన ట్రాఫిక్

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నంలోని సీఎంఆర్ షోరూం సమీపంలో సోమవారం సాయంత్రం కొంతమంది యువకులు గొడవలు పడ్డారు. మత్తులో ఉన్న కొందరు వీరంగం సృష్టించారు. రహదారిపై జనం గుంపుగా చేరడంతో కొంతసేపు వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఎదురైంది. గొడవని వారించే ప్రయత్నం చేసిన ఓ వ్యక్తి మొహంపై దాడి చేసి గాయపరిచారు. పోలీసులు వచ్చి వారిని బలవంతంగా నిలువరించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. నర్సీపట్నంలో తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. సాయంత్రం వేళ పోలీసు గస్తీ విస్తృతం చేయాలని పలువురు కోరుతున్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రావికమతం, న్యూస్‌టుడే: మర్రివలస పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తూ సోమవారం మృతి చెందిన పారుపల్లి సింహాచలం కుటుంబానికి సర్పంచి జోగిపాత్రుడు రూ. 10 వేల ఆర్థిక సాయంగా అందజేశారు. నక్కా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఉపాధి చూపేలా ప్రణాళికలు



సత్యవరం గ్రామస్థులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం అధికారులు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: పేదలకు ఉపాధి కల్పించే విధంగా అందిరికీ పనులు కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని జాతీయ పర్యవేక్షణ కమిటీ అనిల్ గైక్వాడ్ అన్నారు. నారాయణరాజుపేట గ్రామాన్ని కేంద్ర కమిటీ సభ్యులు అనిల్ గైక్వాడ్, అనిల్ నింబోకర్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్వాక్రా సంఘాల మహిళలతో మాట్లాడారు. మహిళల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అందించే రుణాలు తీసుకున్న మహిళలు వాటిని సక్రమంగా వినియోగించి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించడంలో అశ్రద్ధ చూపించవద్దని కోరారు. ఉపాధి హామీ పనులకు వెళ్లే కార్మికులు తప్పనిసరిగా మస్టర్లు వేసుకోవాలని సూచించారు. తప్పుడు మస్టర్లు వేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్వాక్రా సంఘాలు, ఉపాధి హామీ పథకంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ నిధుల వినియోగంలో రికార్డులు సక్రమంగా నిర్వహించలేదని మాజీ సర్పంచి దుబాసి వెంకటగిరి బృందం సభ్యులకు ఫిర్యాదు చేశారు. రికార్డులు పరిశీలించి తగిన విచారణ కోసం జిల్లా కలెక్టరుకు నివేదిక పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జీ ఎంపీడీఓ సీతామహాలక్ష్మీ, ఏపీఎం వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం దృష్టికి పలు సమస్యలు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలవుతున్నాయా, లేదా అని సర్వే చేస్తున్నట్లు బృంద ప్రతినిధులు పేర్కొన్నారు. బృంద సభ్యులు అనిల్‌గైక్వాడ్, అనిల్ నింబోకర్ సోమవారం సత్యవరంలో పర్యటించి గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను సర్పంచి నాగమణి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఎంపీడీవో అప్పారావు, రామారావు, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి సభ్యత్వ నమోదు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: బుచ్చెయ్యపేటలో భాజపా నాయకులు సోమవారం ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మండల అధ్యక్షుడు సీతా నాగరాజు, నాయకులు గొంతిన ఈశ్వరరావు, ముక్కా దేముడుబాబు, మణికంఠ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆసుపత్రికి తరలిస్తుండగా వీఆర్వో మృతి

రావికమతం: జెడ్.కొత్తపట్నం వీఆర్వో బుంగా శ్రీనివాసరావు (46) గుండెపోటుతో మృతి చెందారు. కొత్తకోటలో నివాసం ఉంటున్న ఆయనకు ఆదివారం అర్ధరాత్రి గుండెపోటు రాగా కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడి నుంచి నర్సీపట్నం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మాకవరపాలెం మండలం కొండల అగ్రహారం నుంచి ఇటీవల జరిగిన బదిలీల్లో జెడ్.కొత్తపట్నం వచ్చిన ఆయన శనివారమే విధుల్లో చేరారు. శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భూ ఆక్రమణలపైనే అధికంగా అర్జీలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: స్థానిక సబ్ కలెక్టరేట్‌లో సోమవారం ఆర్డీఓ వి.వి.రమణ చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికంగా భూ ఆక్రమణలపైనే అర్జీలు దాఖలయ్యాయి. ఇందులో మొత్తం 14 దరఖాస్తులు అందాయి. చెట్టుపల్లికి చెందిన పసుపులేటి అప్పలనాయుడు ఆధ్వర్యంలోని పలువురు రైతులు తమను ఇబ్బందులకు గురిచేసి దౌర్జన్యానికి పాల్పడుతున్న స్థిరాస్తి వ్యాపారి గురించి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని వాగులు, దారులను ఆక్రమిస్తున్న ఆయనపై తక్షణం చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని కోరారు. మాకవరపాలెం మండలంలోని దాలెంపాలెంలోని తన ఇంటి స్థలాన్ని ఆక్రమించి దారి లేకుండా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన తాతారావు వినతిపత్రం అందజేశారు. సాగులోని భూమికి పట్టా మంజూరు చేయాల్సిందిగా పాకలపాడుకు చెందిన రాజులు నాయుడు కోరారు. ఇందులో మరి కొన్ని వినతులు సైతం భూ సమస్యలపైనే అందాయని అధికారులు తెలిపారు. ఇందులో తహసీల్దారు రామారావు పాల్గొన్నారు.



అర్జీలు పరిశీలిస్తున్న ఆర్డీఓ రమణ పక్కన తహసీల్దారు రామారావు

ప్రత్యామ్నాయ రహదారి అభివృద్ధి



కాంప్లెక్సు నుంచి కాటా వరకు కొత్తగా నిర్మిస్తున్న డ్రైనేజీ

రావికమతం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్టాండు నుంచి చెరకు కాటా వరకు ప్రత్యామ్నాయ రహదారి అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. బీఎన్ రోడ్డు నుంచి కింతలి రోడ్డును కలుపుతూ చెరకు కాటా వరకు మండల పరిషత్తు నిధులతో రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. ఇరువైపులా ఐదు మీటర్ల వెడల్పుతో కాలువలు, 20 అడుగుల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. చినపాచిల, కవగుంట, గుమ్మళ్లపాడు, కొమిర, కేబీపీ అగ్రహారం, వి.మాడుగుల మండలం వీజేపురం, ఒమ్మలి, కింతలి గ్రామాల ప్రజలు రావికమతం వెళ్లకుండా కాటా నుంచి నేరుగా ఆర్టీసీ మినీ కాంప్లెక్సు, బీఎన్ ప్రధాన రోడ్డుకు చేరుకోవచ్చని ఎంపీటీసీ సభ్యులు వేపాడ లక్ష్మీనాగేశ్వరరావు పేర్కొన్నారు.



ఐదు అడుగుల వెడల్పుతో కాలువ నిర్మాణ పనులు

స్పందనకు వందనం

వీధి దీపాల ఏర్పాటు



దీపాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం పట్టణంలో బీఎన్ రహదారికి ఇరువైపులా పంచాయతీ సిబ్బంది సోమవారం స్తంభాలకు దీపాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి స్వయంభూ వినాయక ఆలయం వరకు 19 స్తంభాలకు దీపాలను ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి నారాయణరావు చెప్పారు. దీపాలు వెలగక రాత్రుళ్లు అంధకారం అలుకుముని రాకపోకలు సాగించేందుకు ఎదురవుతున్న ఇబ్బందులపై ‘చోడవరమా.. శాపమా?’ శీర్షికన సోమవారం ‘ఈనాడు’లో కథనం ప్రచురితమైంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో విద్యుత్తు విభాగం సిబ్బంది దీపాలను ఏర్పాటు చేశారు. రహదారిపై ఇసుక, మట్టి నిల్వలను గురువారం తొలగించేందుకు చర్యలు చేపడతామని ఎంపీడీవో ఆంజనేయులు చెప్పారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట



ఇసుక రవాణాదారులు ఉపయోగిస్తున్న బాటను పొక్లెయిన్‌తో తవ్విస్తున్న పోలీసులు

గొలుగొండ, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా తాండవ జలాశయానికి ప్రధాన నీటివనరైన బొడ్డేవు గెడ్డలో ఇసుకను విచ్చలవిడిగా తవ్వేసి ట్రైరుబళ్లపై తరలిస్తున్నారు. దీంతో చోద్యం-కంతారం, రామచంద్రపాలెం-కృష్ణదేవిపేట మధ్య వంతెనలు, లింగంపేట వద్ద భారీ తాగునీటి పథకం, వెయ్యి ఎకరాలకు ఆధారమైన విప్పలపాలెం ఆనకట్టుతోపాటు గెడ్డకు ఆనుకుని ఉండే రైతులు భూములు కోతకు గురవుతున్నాయి. దీనిపై ఈనెల 4న ‘తవ్వేవారు ఆగరు.. అడగాల్సినవారు అడ్డుకోరు!’ శీర్షికన ‘ఈనాడు’లో వార్తా కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన సీఐ రేవతమ్మ, ఎస్సై దివ్య అక్రమ రవాణా జరుగుతున్న మార్గంలో సోమవారం పొక్లెయిన్‌తో కాలువ తవ్వించారు. ఇకపై ఎవరైనా అక్రమంగా ఇసుక తవ్వి తరలిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

రహదారిపై చెట్టు కొమ్మ తొలగింపు

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ - తురువోలు రోడ్డులో తండుగుబిల్లి మరిడిమాంబ గుడి వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్టు కొమ్మను స్థానికులు తొలగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు, బలంగా వీచిన గాలులకు కొమ్మ విరిగి రోడ్డు అంచులో పడింది. ‘రోడ్డు అంచులో ముప్పు’ శీర్షికన సోమవారం ‘ఈనాడు’లో వార్త ప్రచురితమైంది. స్పందించిన స్థానికులు రాకపోకలు సాగించే క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురవకుండా కొమ్మను తొలగించారు.

చందాకూ డిజిటల్ చెల్లింపులు

గ్రామ దేవతల పండగలకు.. మండపాలు ఏర్పాటు చేసి నిర్వహించే పండగలకు వాహనదారులను ఆపి పదో పరకో చందా వసూలు చేయడం సాధారణమే. ఇలాంటప్పుడు చాలామంది జేబులో డబ్బులు లేవు... చిల్లర లేదంటూ తప్పించుకు వెళ్తుంటారు. అందుకే చందా వసూలు చేసేవారు కొత్తగా ఆలోచించారు. గొలుగొండ మండలం లింగంపేటలో దసరా ఉత్సవాల నిర్వహణకు చందాలు వసూలు చేస్తున్న వారంతా ఇదిగో ఇలా.. డిజిటల్ స్కానర్‌ను ఉపయోగిస్తున్నారు. దీంతో వాహనదారులు అవాక్కవుతున్నారు.

– గొలుగొండ, న్యూస్‌టుడే



భూవివరాలు పునరుద్ధరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న గిరిజన నాయకులు, రైతులు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: గిరిజనుల సాగులో ఉన్న భూముల వివరాలను ఆన్‌లైన్, రెవెన్యూ రికార్డుల్లో పునరుద్ధరించాలని కోరుతూ తామరబ్బ శివారు పల్లపుకోడాబుకు చెందిన రైతులు ఉప తహసీల్దారు అప్పారావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అంతకుముందు వారంతా తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. గిరిజన సంఘ నాయకులు పైడిరాజు, మంగరాజు,. చిన్నారావు, తమ్మయ్య, శ్రీను, ఈశ్వరరావు, కుమార్ పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై కేసు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: శ్మశానంలో మట్టి అక్రమం తవ్వకాలపై వీఆర్వో నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మల్లేశ్వరరావు చెప్పారు. ఈ పొక్లెయిన్, ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న పొక్లెయిన్, ట్రాక్టరు

జ్యూస్ దుకాణ యజమానిపై..

రావికమతం, న్యూస్‌టుడే: బాల కార్మికుడితో పని చేయిస్తున్న జ్యూస్ దుకాణ యజమానిపై కార్మిక శాఖ అధికారులు సోమవారం కేసు నమోదు చేశారు. సహాయ కార్మిక శాఖ అధికారి సూర్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆపరేషన్ స్వచ్ఛలో భాగంగా కార్మిక, పోలీసు, ఐసీడీఎస్ అధికారులు, సీడ్ ఆర్గనైజేషన్ సంస్థ ప్రతినిధులు రావికమతంలోని పలు దుకాణాలు, సంస్థల్లో తనిఖీలు చేపట్టారు. స్థానిక ఓ ఫ్రూట్ జ్యూస్ దుకాణంలో బాల కార్మికుడు పనిచేయడాన్ని గుర్తించి యజమానిపై కేసు నమోదు చేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఎస్సై అప్పారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజిని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అష్టాయుధాలతో మహాచండీ దేవి అలంకరణ



నర్సీపట్నంలో చండీదేవిగా దుర్గమ్మ

నర్సీపట్నం/అర్బన్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బలిఘట్టంలోని దుర్గామల్లేశ్వరస్వామి, సోమవారం దుర్గమ్మ అష్టాయుధాలతో మహాచండీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అష్ట భుజాలు కలిగిన అమ్మవారి చేతుల్లో ఎనిమిది రకాల ఆయుధాలను ఉంచి పాదం కింద సింహంతో తీర్చిదిద్దిన కనకదుర్గ ఉగ్ర రూపం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయంలో శివుడికి మహా రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. వేములపూడి దుర్గాదేవి ఆలయం వద్ద వీరభద్ర సంబరం నిర్వహించారు

దేవరాపల్లి: వేచలంలోని అఖిలేశ్వరస్వామి శివపీఠంలో నిర్వహించిన ఉత్సవాల్లో వైకాపా జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు సోమవారం రాత్రి పాల్గొన్నారు. పీఠం ధర్మకర్త, గురుభవాని వెంకటరావు, వరహాలమ్మ దంపతులు ఆయన్ను సత్కరించి ప్రసాదాలు అందజేశారు. సర్పంచి శరారినాయుడు, జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, చిన్నంనాయుడు, శేఖర్ పాల్గొన్నారు.



అంబలం పూజలో ఎమ్మెల్యే రాజు

గజపతినగరంలో అంబలం పూజ

చోడవరం, న్యూస్‌టుడే: గజపతినగరంలో దుర్గాదేవి అంబలం పూజ ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. వెంకన్నపాలెం సర్పంచి ఈశ్వరరావు, విఘ్నేశ్వర ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ పసుమర్తి సాంబశివరావు, కనిశెట్టి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



సీతయ్యపేటలో..



బంతి, చామంతిపూల అలంకరణలో..

చోడవరం పట్టణం, బుచ్చెయ్యపేట: చోడవరం దుర్గాదేవి ఆలయంలో బంతి, చామంతి పూలు, వస్త్రాలతో అమ్మవారి అలంకరణ ఆకట్టుకుంది. బుచ్చెయ్యపేట మండలం సీతయ్యపేట ఆలయంలో దుర్గామల్లేశ్వర అమ్మవారికి మహాకుంభాభిషేకం చేశారు. పాత సినిమా హాలు సమీపంలోని మోదమాంబ ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

‘ఇసుక దొరక్కపోవడానికి కారణం వైకాపాయే’

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ప్రజలకు ఇసుక అందకుండా చేసింది నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే గణేషేనని 24వ వార్డు తెదేపా కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు విమర్శించారు. నర్సీపట్నం విలేకరులకు సోమవారం పంపిన వీడియో ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత గబ్బాడ ఇసుక యార్డులో రూ. 5 కోట్ల ఇసుక కుంభకోణం జరగబోతోందని గణేష్ ప్రకటించడంతో శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు విచారణ జరిపించారని మధు వివరించారు. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండగా రాజమహేంద్రవరం ఇసుక రేవు నుంచి దొంగతనంగా తీసుకువచ్చి అమ్మి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. గబ్బాడలో నిల్వ చేసిన ఇసుకకు గనులశాఖ అధికారులు ప్రతిమ ఇన్‌ఫ్రా సంస్థకు రూ. 18.7 కోట్ల జరిమానా విధించిన విషయం గుర్తు చేశారు. తప్పుని కప్పిపుచ్చుకోవడానికి ఈనెల 21న వైకాపా నాయకులు ర్యాలీ, ధర్నా పేరిట నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఎలాగూ శాసన సభాపతి అయ్యన్న ఇసుక త్వరలోనే ప్రజలకు అందుబాటులో తెస్తారని.. తమవల్లే ఇసుక వచ్చిందని చెప్పుకోవడానికే వైకాపా నాయకులు ధర్నా పేరుతో నాటకాలాడుతున్నారని ఆరోపించారు. తెదేపా మాజీ కౌన్సిలర్లు కృష్ణ, మురళీ, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధు, పక్కన మాజీ కౌన్సిలర్లు

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - శ్వాగ్

రైతు బజార్లలో రూ.50కే కిలో టమోటా

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని రైతు బజార్లలో ఈనెల 8 తేదీ మంగళవారం నుంచి రాష్ట్ర ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై కిలో టమోటా రూ. 50కే విక్రయించనున్నట్లు జేసీ మయూర్ అశోక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కో కుటుంబానికి కిలో మాత్రమే అమ్మనున్నారు. వినియోగదారులు ఆధార్ లేదా రేషన్ కార్డును కౌంటర్ నందు చూపించాలని ప్రకటనలో పేర్కొన్నారు. కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెందుర్తి

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM
పెందుర్తి : 90598 98721 వేపగుంట: 93472 79909

సమస్య: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ క్రాంతినగర్ కాలనీలోని లేక్ అవెన్యూ బహుళ అంతస్తుల భవనాల సమీపంలోని కాలువలు పూడుకుపోయాయి. నెల రోజులుగా కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగు నిలిచిపోయి దోమలు, దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. – సీహెచ్.నారాయణ, క్రాంతినగర్

సమాధానం: మీ ప్రాంతంలో సిబ్బందితో కాలువలు శుభ్రం చేయించి పరిశుభ్రత చర్యలు తీసుకుంటాం.– రమేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, 97వ వార్డు

– న్యూస్‌టుడే, క్రాంతినగర్(పెందుర్తి)

అనుసంధాన దారి.. అవస్థలుగా మారి..


కంకర తేలి ప్రమాదకరంగా

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: ఆ దారిలో నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు. బడి బస్సులు సైతం ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటాయి. చినముషిడివాడ నుంచి సుజాతనగర్ వరకు పలు కాలనీలను అనుసంధానించే ప్రధాన మార్గమిది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న సిద్ధార్థనగర్ రహదారి గత పదేళ్లుగా నిరాదరణ గురైంది. ఈ మార్గాన్ని అభివృద్ధి చేయడంలో పాలకులు, అధికారులు దృష్టి సారించలేదని నివాసితులు వాపోతున్నారు. చినముషిడివాడ నుంచి పీఎఫ్ కాలనీ మీదుగా సిద్ధార్థనగర్‌కు వెళ్లే సీసీ రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఎక్కడ చూసినా గోతులే దర్శనమిస్తున్నాయి. చక్కగా ఉన్న సిమెంటు రోడ్డును భూగర్భ మురుగు నీటి వ్యవస్థ పనుల కోసం తవ్వేశారు. గొట్టాలు, సంపులు ఏర్పాటు చేసిన తర్వాత గోతులను పూడ్చారు. గోతుల్లో మట్టి గట్టి పడకుండానే కాంక్రీటు వేయడంతో పనుల్లో నాణ్యత లోపించింది. దీంతో ఆయా గోతులు పూడ్చిన చోట రోడ్డు భూమిలోకి కుంగిపోయింది.


పూర్తిగా ధ్వంసమైన రహదారి

రాత్రివేళ భయంగా ప్రయాణం

ఈ మార్గంలో రాత్రివేళ ప్రయాణం నరకంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతులతో పాటు కంకర తేలడంతో ప్రమాదాలకు గురవుతున్నామని ద్విచక్ర వాహనదారులు చెబుతున్నారు. దీంతో పాటు వీధిదీపాలు సక్రమంగా లేకపోవడంతో భయంగా రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. వర్షం కురిస్తే పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని తెలిపారు. గోతుల్లో వర్షం నీరు నిలిచిపోయి ఇబ్బంది పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. చినముషిడివాడ నుంచి సుజాతనగర్ 80 అడుగుల రహదారిని అనుసంధానించే ఈ దారి వెంట పలు కాలనీలున్నాయి. వేలాది మంది ప్రజల రాకపోకలు సాగించడానికి ఉపయోగపడే ఈ దారిపై పాలకులు, అధికారులు దయచూపాలని ప్రజలు కోరుతున్నారు.


ఇళ్ల ముందు గోతులు

పొదలు తొలగింపు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం పైడివాడ నీళ్ల ట్యాంకు వద్ద విద్యుత్తు స్తంభానికి పొదలు అల్లుకుపోయాయి. దీనివల్ల కలిగే ఇబ్బందులపై ఈనెల 6న 'నిర్లక్ష్యానికి నిదర్శనం' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురించిన

స్పందనకు వందనం

వార్తకు ఈపీడీసీఎల్ అధికారులు స్పందించారు. సిబ్బందిని పంపించి సోమవారం పిచ్చిమొక్కలను తొలగించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, చిత్రంలో ఎంపీపీ సూర్యకుమారి, అధికారులు

సబ్బవరం, న్యూస్‌టుడే: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ. 25 కోట్లతో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు స్పష్టం చేశారు. సబ్బవరం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రమేశ్‌బాబు పాల్గొని మాట్లాడారు. రూ. 9 కోట్లు సబ్బవరం మండలానికి కేటాయింపులు జరిగాయన్నారు. గ్రామాల్లోని ప్రజాప్రతినిధుల సూచనల మేరకు నివేదిక తయారు చేసి పంపాలని ఉపాధి హామీ పథకం అధికారులకు సూచించారు. అధికారుల బదిలీల కారణంగా గత మూడు నెలలుగా ఏ విధమైన అభివృద్ధి పనులు జరగలేదన్నారు. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ప్రతిపాదించిన పనులు వెంటనే చేయాలన్నారు. సబ్బవరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి రూ. 2 కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరడం జరిగిందన్నారు. మరో రెండు మూడు నెలల్లో నిర్మాణాలు ప్రారంభమవుతాయన్నారు. విద్యుత్తు, రెవెన్యూ, మైనర్ ఇరిగేషన్, ఆర్అండ్‌బీ సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు మామిడి శంకరరావు, పడాల వెంకటరమణ, కోరాడ శ్రీను, పల్ల సోమేశ్వరరావు, బోకం సోమునాయుడు, కర్రి నర్సింగరావు, దాడి కన్నంనాయుడు తదితరులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వీటన్నింటినీ పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. వచ్చే సమావేశానికి వీఆర్‌వోలు, హాజరయ్యేలా చూడాలని ఇన్‌ఛార్జి తహసీల్దారు అప్పారావుకు సూచించారు. ఉప ఎంపీపీలు ఝాన్సీలక్ష్మీరాణి, చొక్కాకుల గోవింద, ఎంపీడీవో పి. పద్మజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ముందుగా మండల పరిషత్ సమావేశ మందిరంపై నిర్మించిన అతిథి గృహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.


సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం ఆరిపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2007-08 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు సోమవారం స్థానిక మజ్జి గౌరమ్మ ఆలయ ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు పలకరించుకుంటూ ఆనందోత్సాహాల నడుమ కరచాలనం చేసుకున్నారు. అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. ఒక్కొక్కరూ మాట్లాడుతూ వారి విజయాలు, వైఫల్యాలను వివరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న స్నేహితులకు సహాయపడాలని తీర్మానించుకున్నారు.


సమావేశమైన పూర్వవిద్యార్థులు

రహదారి నిర్మాణంపై ఇరువర్గాల వాదులాట

చీమలాపల్లి(వేపగుంట), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లి - పొర్లుపాలెం మధ్య ఇటీవల నిర్మించిన సీసీ రహదారి విషయంలో స్థానికుల మధ్య వివాదం చెలరేగింది. గతంలో వుడా ప్రణాళికలో 40 అడుగులు ఉండగా భూగర్భ డ్రైనేజీ మరమ్మతుల పేరిట కేవలం 20 అడుగులు మాత్రమే సీసీ రోడ్డు నిర్మించడంపై స్థానికులు, పొర్లుపాలెం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేయగా టీపీవో తేజేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు పొక్లెయినరుతో ఆక్రమణలను తొలగించేందుకు బుధవారం గ్రామానికి వెళ్లారు. రహదారిని అనుకొని నిర్మాణాలు చేసిన వారంతా కూల్చి వేయొద్దంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. మరికొంతమంది ఆక్రమణలను తొలగించి రహదారి నిర్మించాలని పట్టుబట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య వాదులాట చోటుచేసుకుంది. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు వుడా ప్రణాళిక ప్రకారం మార్కింగ్ ఇచ్చారు. నాలుగు రోజుల్లో ప్రజలే స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించాలని లేకుంటే తామే కూల్చి వేయాల్సి వస్తుందని చెప్పి అధికారులు వెళ్లిపోయారు.


వివాదానికి కారణమైన రోడ్డు

అధికారుల బాధ్యతల స్వీకరణ

సబ్బవరం, న్యూస్‌టుడే: ఇటీవల నిర్వహించిన బదిలీల్లో భాగంగా సబ్బవరం మండలానికి వచ్చిన అధికారులు సోమవారం బాధ్యతలు స్వీకరించి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా 'న్యూస్‌టుడే'తో వారు మాట్లాడుతూ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు.


☛ **పి.హారిణి:** ఈమె పంచాయతీరాజ్ ఏఈ. పరవాడ నుంచి సబ్బవరం వచ్చి విధుల్లో చేరారు. గతంలో కశింకోట, అనకాపల్లి మండలాల్లో పనిచేశారు. ఈమె స్వస్థలం విశాఖ నగరం.


☛ **ఎస్.సాయికిరణ్:** మండల మైనర్ ఇరిగేషన్ ఏఈగా బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీకాకుళం వంశధార ప్రాజెక్టులో పనిచేసి ఇక్కడకు వచ్చారు. గతంలో నెల్లిమర్లలోని హైడ్రాలిక్స్ విభాగంలో పనిచేశారు. ఈయన స్వస్థలం శ్రీకాకుళం జిల్లా టెక్కలి.


☛ **సీహెచ్ బాలాజీ:** ఉపాధి హామీ పథకం ఏపీవోగా విధుల్లో చేరారు. మాకవరపాలెం మండలం నుంచి సబ్బవరం వచ్చారు. గతంలో అనకాపల్లి మండలాల్లో పనిచేశారు. ఈయన స్వగ్రామం కె.కోటపాడు.


పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండల గృహనిర్మాణ శాఖ ఏఈగా ఈ.రామచంద్రరావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన బుచ్చయ్యపేట మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు పరవాడ ఏఈగా పనిచేసిన ఎంఎస్ఎస్ఎన్. రెడ్డి సబ్బవరానికి బదిలీపై వెళ్లారు.


సరిపల్లి దుర్గమాంబ


సుజాతనగర్‌లో మహాచండీ అవతారం


శ్రమశక్తినగర్‌లో..


లలితా త్రిపుర సుందరిగా నాయుడుతోట గాయత్రీ దేవి


దుర్గానగర్‌లో..


బాలాజీగార్డెన్ అపార్ట్‌మెంట్‌లో పసుపుకొమ్ములతో అలంకరణ


శారదాపీఠంలో అమ్మవారికి హారతులిస్తున్న పీఠాధిపతులు

మహాచండీ.. శత్రు సంహారిణి


ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రంలో సామూహిక కుంకుమ పూజలు


పెదతాడిలో కోలాటం ఆడుతున్న మహిళలు

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అఖిలాండకోటి బ్రహ్మాండనాయకి దుర్గమ్మకు విశేష పూజలు, ఆరాధనలు చేశారు. శత్రు సంహారం చేసి శిష్ట జనులను రక్షించిన మహాచండీ అవతారంలో జగన్మాత దర్శనమిచ్చారు. నియోజకవర్గం పరిధిలోని పలు దేవాలయాలు, భవానీ దీక్షాపరులు, ఉత్సవ మండపాల నిర్వాహకులు ఆధ్వర్యంలో అమ్మవార్లను మహాచండీగా అలంకరించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన, పారాయణాలు చేశారు. పలుచోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, సబ్బవరం, పరవాడ


పిట్టవానిపాలెంలో మహాదేవిగా..


సంతానలక్ష్మిగా సప్తగిరినగర్ అలమేలు మంగమ్మ


పాపయ్యరాజుపాలెం పిరమిడ్ ధ్యాన కేంద్రంలో భక్తి గీతాలాపన


పాత పెందుర్తిలో భోజనాలు వడ్డిస్తున్న జీవీఎంసీ తెదేపా ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు


కృష్ణానగర్‌లో..


గవరజగ్గయ్యపాలెంలో..


మణిపురం భువనేశ్వరీదేవి..


దేవీపురం రాజరాజేశ్వరీమాత..


పరవాడలో..


పి.భోనంగిలో..


జాజులవానిపాలెంలో..

రాష్ట్ర యోగా పోటీల్లో ప్రతిభ

పరవాడ, న్యూస్‌టుడే: ఏపీ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లాలో ఈనెల 5 నుంచి 7 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పరవాడ మండలం తానాం బీసీ బాలికల గురుకులం పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థినులు ప్రతిభచాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల యోగా కోచ్ ఆంజనేయులు సోమవారం తెలిపారు. కె.వెంకటవైష్ణవి, కె.భావన, కె.ధనలక్ష్మి, బి.భావన, ఎస్.కౌశిక, ఎల్.భవంతి, ఈ.హర్షిత, బి.వైష్ణవి వివిధ కేటగిరీల్లో పాల్గొని 8 బంగారు పతకాలు సాధించారన్నారు. వీరంతా నవంబరు 18 నుంచి 22 వరకు అస్సాంలో నిర్వహించనున్న జాతీయ పోటీల్లో పాల్గొంటారని కోచ్ వెల్లడించారు. విద్యార్థినులను పాఠశాల ప్రిన్సిపల్ అప్పలనాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది సోమవారం అభినందించారు.


మంత్రి టి.జి.భరత్ చేతులమీదుగా పతకాలు అందుకున్న విద్యార్థినులు

10న ఉక్కులో ధర్నా

ఉక్కునగరం (స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కులో విద్యుత్తు ఛార్జీల పెంపు, ఇంటి అద్దె చెల్లింపు వంటి సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 10న ధర్నా నిర్వహిస్తామని ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఎం. రాజశేఖర్ తెలిపారు. సోమవారం ప్రధాన పరిపాలన భవనం వద్ద కార్మికులు చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. కార్మిక సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చిత్తశుద్ధితో పని చేయాలని కోరారు. కార్మిక సంఘాల సభ్యులు పి.వి.రమణమూర్తి, బి.అప్పారావు, జి.నరేంద్ర, పి.పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యా శిక్షణతో ఉపాధి

వేపగుంట, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయి నుంచే వృత్తి విద్యా శిక్షణను విద్యార్థులు పొందడంతో భవిష్యత్‌లో తొందరగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా బాలికా సంరక్షణ, జిల్లా వృత్తి విద్యా శిక్షణ పర్యవేక్షణ అధికారిణి ఖాలీషా బేగం అన్నారు. చింతలగ్రహారం జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులకు వేపగుంటలోని ఓ మెకానిక్ దుకాణంలో ఇస్తున్న ఇంటర్న్‌షిప్ శిక్షణను సోమవారం ఆమె పరిశీలించారు. శిక్షణలో తెలుసుకున్న విషయాలపై విద్యార్థులకు పలు ప్రశ్నలు వేశారు. ఈ శిక్షణను ప్రతి విద్యార్థి ఉపయోగించుకునేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల వృత్తి శిక్షణ ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.


విద్యార్థుల శిక్షణను పరిశీలిస్తున్న ఖాలీషా బేగం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 4 అర్జీలు


అర్జీలను స్వీకరిస్తున్న జెడ్సీ హేమవతి

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంటలోని జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు వచ్చినట్లు జెడ్సీ హేమవతి తెలిపారు. పురుషోత్తపురంలో రోడ్డు ఆక్రమణ, నరసింహనగర్‌లో పిచ్చిమొక్కలు తొలగించాలని, ఎస్సీ, బీసీ కాలనీలో రహదారులు, కాలువలు నిర్మించాలని, అడవివరంలో మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని అర్జీలు అందజేశారన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు జెడ్సీ తెలిపారు. ఆర్వో నారాయణరావు, వర్క్స్ డీఈ విజయ్‌కుమార్, ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు

ఈనాడు కథనానికి స్పందన

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలంలోని వాడచీపురుపల్లి, పరవాడ గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించారు. గతకొద్ది రోజులుగా చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో దుర్వాసనతో ప్రజలు ఇక్కట్లు పడేవారు. శునకాలు చిందరవందర చేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారేవి. ఈగలు, దోమలు వృద్ధి చెందడంతో స్థానికులకు కంటినిండా నిద్ర కరవయ్యేది. ఈ సమస్యపై 'పల్లెలు వ్యర్థాలమయం' శీర్షికతో ఈనెల 7న 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి ఈవోపీఆర్డీ ధర్మారావు, వాడచీపురుపల్లి, పరవాడ పంచాయతీ కార్యదర్శులు అచ్యుతరావు, మురళీధర్ పట్నాయక్ స్పందించారు. పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బందితో చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వాడచీపురుపల్లి సామాజిక భవనం వద్ద చెత్త తొలగించి శుభ్రం చేసిన దృశ్యం


పరవాడలో వ్యర్థాలను తరలిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది